మీకు ఆస్థి ఉండి
తగినంత రుణ సదుపాయం
పొందలేక పోతున్నారా?
ఉచిత సలహాలకై
మమ్మల్ని సంప్రదించండి
6303988189

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 266 విశాఖపట్నం, 12 ఆగస్టు 2022 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00
Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, East Godavari, West Godavari, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

## అందుకే వారికి కడుపు మంట: సీఎం

**బాపట్ల:** ఏ బిడ్డకైనా అతి గొప్ప దీవెన చదువు మాత్రమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ బిడ్డకైనా తప్పనిసరిగా అందాల్సింది చదువు మాత్రమే. చదువు అన్నది ఏ ఒక్కరూ కొల్లగొట్టలేనిదన్నారు. బాపట్లలో గురువారం జరిగిన 'జగనన్న విద్యా దీవెన' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. పేదరికం నుంచి చదువుల ద్వారానే బయటపడేయగలమన్నారు. రాబోయే కాలంలో పోటీని ఎదుర్కొంటూ సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో పిల్లలంతా జీవించాలని దీనికోసం ప్రభుత్వం చేయాల్సింది చేస్తున్నామని సీఎం అన్నారు.

"ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యాదీవెన చెల్లిస్తున్నాం. తల్లుల ఖాతాల్లోకి ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం. 11.02 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.694 కోట్ల రూపాయాలు చెల్లిస్తున్నాం. విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికంగా, రక్షణ పరంగా అన్నిరకాలుగా అక్క చెల్లెమ్మలకు మంచిచేస్తున్నాం. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడునెలలకు సంబంధించిన వందశాతం ఫీజు రియింబర్స్ మెంట్ చెల్లిస్తున్నామని" సీఎం అన్నారు.

పదేళ్ల కిందట ఎలాంటి ప్రపంచం ఉండేది. 20 ఏళ్ల తర్వాత మన బ్రతుకులు ఎలా ఉంటాయి.. అంటే.. ఊహకందని విషయం. అంత వేగంగా మార్పులు వస్తున్నాయి. ఆ మార్పులతో మనం ప్రయాణం చేయాలి. లేకపోతే మన పిల్లలు ప్రపంచంతో పోటీపడలేరు. అందుకనే ప్రతి అడుగులోనూ మార్పు కనిపించాలి. అప్పుడే గొప్ప మార్పులు సాధ్యమవుతాయి. అలాంటి చదువులు రాష్ట్రంలో ప్రతి బిడ్డకూ అందాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర కులాల్లోని పేద కుటుంబాలకు చెందిన బిడ్డలు, నా



బిడ్డలు పెద్ద చదువులు చదువుకోవాలి.

మీ అందరి అన్నగా దీన్ని కోరుకుంటూ 3 ఏళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాం. అందులో భాగంగానే ప్రాథమిక విద్యలోనే కాకుండాపెద్ద చదువులను కూడా పేదలకు అందుబాటులోకి తీసుకువస్తూ 100 శాతం ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం. ఫీజులు ఎంతైనా ప్రభుత్వమే చెల్లిస్తోంది. మీరు వెళ్లండి.. చదవండి.. ఎంతమంది బిడ్డలు ఉంటే.. అంతమందిని చదివిస్తాను అని సగర్వంగా తెలియజేస్తున్నాను.

రేషన్‌లా ఆలోచించి ఒక్కరికే కాదు.. అందరికీ అందిస్తాం. చదివినప్పుడే మన బతుకులు, తలరాతలు మారుతాయి. ఏ ఒక్క రాష్ట్రంలో లేని విధంగా ఈ పథకం మన రాష్ట్రంలో అమలవుతుంది. తల రాతలు మార్చాలన్న ప్రయత్నం ఇవాళ రాష్ట్రంలో జరుగుతోంది. ప్రతి తల్లి, తండ్రి కూడా ఖర్చుకు వెనకాడకుండా.. మీ బిడ్డలను బాగా చదివించండి. ఎంత మంది బిడ్డలు ఉన్నా.. చదివించండి.. తోడుగా మీ అన్న, తమ్ముడైన నేను ఉంటాను. ఆ బాధ్యత నేను తీసుకున్నాను. ప్రతి ఇంట్లోని నుంచి ప్రతి డాక్టర్, ఇంజినీర్, కలెక్టర్ వంటి పెద్ద పెద్ద చదువులు చదువుకునే నా బిడ్డలు బయటకు రావాలి.

2017-18, 2018-19 సంవత్సరాలకు ఫీజు రియింబర్స్‌మెంట్‌బకాయిలను రూ.1778 కోట్లను నేను కట్టాను. మన పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కట్టాను. జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన పథకాలకే ఈరెండు సంవత్సరాల కాలంలో రూ. 11,715 కోట్లు నా అక్క చెల్లెమ్మలకు మూడేళ్ల కాలంలో ఇచ్చాం. పిల్లలను చదివించుకోవడంకోసం అప్పులు పాలు కాకూడదు, పొలాలు అమ్ముకునే పరిస్థితి రాకూడదని గొప్ప ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తున్నాం. పిల్లల చదువులకు ఏదీ అడ్డంకాకూడదని ఈ కార్యక్రమాలు చేస్తున్నాం.

ఒక్క విద్యారంగంలోని అమ్మ ఒడి, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యాకానుక, మన బడి నాడు-నేడు, ఇంగ్లిషు మీడియం, బైజూస్‌తో ఒప్పందం ఇవి మాత్రమే కాకుండా హయ్యర్ ఎడ్యుకేషన్‌లో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాం.

పాఠ్యప్రణాళికలో 30 నుంచి 40 శాతం నైపుణ్యాలను అభివృద్ధి చేయడం కోసం ఉద్దేశించాం. 10 నెలల ఇంటర్నెషిప్ ఏర్పాటు చేశాం. మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. విద్యారంగం మీద రూ. 53,338కోట్లు మూడేళ్లకాలంలో పెట్టాం. కాలేజీల్లో చేరుతున్నవారి సంఖ్యను పెంచాలన్నది ఉద్దేశం.

035 నాటికి 70శాతానికి జీఆర్ రేషోను పెంచాలన్నది ధ్యేయం. 2018-19 తో పోలిస్తే 2019-20లో 8.64శాతం పెరిగింది. జాతీయ స్థాయిలో 3.04 శాతం మాత్రమే. ఆడపిల్లలకు సంబంధించి రాష్ట్రంలో జీఈఆర్ రేషో 11.04శాతం వృద్ధి అయితే దేశవ్యాప్తంగా 2.28 శాతం వృద్ధి మాత్రమే. 2018లో ప్రాథమిక

(మిగతా 2లో)

## భారత 14వ ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్ ప్రమాణం

న్యూఢిల్లీ: భారతదేశ 14వ ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ధన్‌కర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సహా పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు.

ప్రమాణ స్వీకారానికి ముందు జగదీప్ ధన్‌కర్.. రాజ్ ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. ఇటీవల జరిగిన



ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన జగదీప్ ధన్‌కర్.. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి మార్గరెట్ అల్వాపై గెలుపొందారు. ఆయన 528 ఓట్లు రాగా, అల్వాకు 182 ఓట్లు

(మిగతా 2లో)

## ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా విశాఖను చూద్దాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అందమైన విశాఖ నగరాన్ని 'ప్లాస్టిక్ ఫ్రీ సిటీ'గా చూడాలన్నదే ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ధ్యేయం అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. గురువారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశతో కలసి పత్రికా విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర్ మేయర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ బదులు గుడ్డ, నార సంచులతో పాటు అనేక ప్రత్యామ్నాయ సామగ్రిని నగర ప్రజలు వాడుకునేలా ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు విశాఖ బీచ్‌లో 'ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మేళా' నిర్వహించనున్నట్టు తెలిపారు. అదే విధంగా విశాఖను కాలుష్య రహిత సిటీగా చూసేందుకు సొంత వాహనాలు వదిలి, ప్రజా రవాణా వ్యవస్థనే ఉపయోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలంతా

(మిగతా 2లో)

## యువత దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేయాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి నేటి యువత పాటుపడాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ సంయుక్తంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల జీవిత చరిత్రలతో స్థానిక ద్వారకా బస్సు స్టాండు ఆవరణలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను గురువారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ క్రమంలో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సమాచార శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రతి ఒక్కరూ తిలకించుట ద్వారా భారత దేశాన్ని బానిస సంకెళ్ళ నుండి విడిపించేందుకు కృషి చేసిన ఎందరో దేశభక్తులను గుర్తు చేసుకోవచ్చన్నారు. బ్రిటిష్ వారితో పోరాడి, భావితరాల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేశారని, వారి ఆశయాల స్ఫూర్తితో యువత దేశాన్ని



అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన త్యాగధనులను నేటి యువత స్మరించుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను ఈ తరం వారికి తెలియజేసేందుకు వారి ఫోటోలతో కూడిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఈ రోజు నుండి 25వ తేదీ వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందుగా ఫోటో ఎగ్జిబిషన్ నందు ఏర్పాటు చేసిన స్వాతంత్ర్యసమర యోధుల ఫోటోలను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు.

(మిగతా 2లో)

## ఉచిత పథకాలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

దేశవ్యాప్తంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత పథకాల్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇవాళ తీవ్రంగా స్పందించింది. ఇవాళ మరోసారి దీనిపై విచారణ నిర్వహించిన సీజేఐ ఎన్వీ రమణ నేతృత్వంలోని సుప్రీం ధర్మా సనం.. కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ కీయ పార్టీలు, ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యేలా ఉన్నాయి. ఈ వ్యవహారంలో తదుపరి విచారణను సుప్రీం కోర్టు ఈ నెల 17కు వాయిదా వేసింది.

ఉచితాలపై సుప్రీం విచారణ దేశ వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ప్రకటిస్తున్న ఉచిత పథకాలు, వాటి కోసం అనంతరం పెడుతున్న ఖర్చు, దాంతో దేశ ప్రగతిపై పడుతున్న ప్రభావం వంటి అంశాలపై సుప్రీం కోర్టు ఇవాళ కీలక విచారణ నిర్వహించింది. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఉచిత హామీలు ఇస్తున్న రాజకీయ పార్టీలను నిషేధించాలని కోరుతూ అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిల్‌ను సుప్రీంకోర్టు ఇవాళ విచారించింది. ఎన్నికల మేనిఫెస్టోను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, అందులో చేసిన వాగ్దానాలకు రాజకీయ పార్టీలు జవాబుదారీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఉచితాలపై



సుప్రీంకోర్టులో జరిగిన విచారణ ఆసక్తికర వాదనలు కూడా చోటు చేసుకున్నాయి. పోలింగ్ సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాల ప్రకటనపై సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.

ఉచితాలు తీవ్ర సమస్య అన్న సుప్రీంకోర్టు ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేయడం, అనంతరం ఉచిత పథకాలు పంపిణీ చేయడం "తీవ్రమైన సమస్య" అని సుప్రీంకోర్టు ఇవాళ పేర్కొంది. దీని కారణంగా ఆర్థిక వ్యవస్థ నష్టపోతోందని తెలిపింది. ఇది సమస్య కాదని ఎవరూ అనరని, ఇది తీవ్రమైన సమస్యని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉచితాలు పొందుతున్న వారికి అది కావాలి, మాది సంక్షేమ రాజ్యం, తాము పన్నులు చెల్లిస్తున్నామని, అభివృద్ధి ప్రక్రియకు

(మిగతా 2లో)

## 5వ జోన్ లో 4.35 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగర ప్రజలకు మౌళిక వసతుల కల్పనే ప్రధాన కర్తవ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె 5వ జోన్, 41, 46, 47వ వార్డులలో పలు అభివృద్ధి పనులకు సుమారురూ. 4.35 కోట్ల రూపాయలతో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, వైఎస్అర్ సిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు ఆయా వార్డుల కార్పొరేటర్లుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో నగరంలోని ప్రజలకు మౌళిక వసతులు, సంక్షేమ పథకాలు కల్పించడం జరుగుతుందని, 5వ జోన్ లో ఇప్పటికే చాలా పనులు చేపట్టామని ప్రస్తుతం బిటి రోడ్లు, సీసీ కాలువలు, కల్వర్టులు, రీటైనింగ్ వాల్స్ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలైన త్రాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలుకు అందించగలుగుతున్నారు. జోన్ లోని వార్డు పరిధిలో ఉన్న కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజల అవసరాలు తీర్చడంలో ముందు ఉంటున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, కె. అనిల్ కుమార్, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మాహుతి దాడి: అమరులైన ముగ్గురు జవాన్లు.. ఇద్దరు ముష్కరులు హతం



అనుమానాలే నిజమయ్యాయి. స్వాతంత్ర్య సంబరాల వజ్రోత్సవ వేడుకల నేపథ్యంలో దేశంలోని కీలకమైన స్థానాల్లో భారీ ఉగ్రదాడులకు ప్లానింగ్ జరుగుతుందంటూ నిఘా వర్గాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే.

తాజాగా అలాంటి కుట్ర ఒకటి బయటకు వచ్చింది. ఆర్మీ క్యాంప్ మీదకు ముష్కరులు దాడికి యత్నం చేయగా.. వారికి ధీటుగా సమాధానం ఇచ్చిన క్రమంలో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. ఈ విషాద ఘటన తాజాగా జమ్ముకశ్మీర్ ప్రాంతంలోచోటు చేసుకుంది. ఉగ్రవాదులు పన్నిన ఆత్మాహుతి దాడిని సమర్థంగా తిప్పి కొట్టినప్పటికీ.. అందులో భాగంగా ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయిన వైనం షాకింగ్ గా మారింది.

గురువారం తెల్లవారుజామున రాజౌరీ జిల్లా పార్గల్ లోని ఆర్మీ క్యాంప్ ఫెన్సింగ్ ను దాటి లోపలకు వచ్చేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించారు. క్యాంప్ లో ఆత్మాహుతి దాడికి కుట్ర పన్నారు. అయితే.. ఈ కుట్రను గుర్తించిన ఆర్మీ జవాన్లు వెంటనే కాల్పులు జరిపారు.

దీంతో అలెర్టు అయిన భద్రతా సిబ్బంది కూడా కాల్పులు చేపట్టారు. అయితే.. వారిపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి.. వైద్యం చేయిస్తున్నారు.

ఈ దాడిలో ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది. గడిచిన ఆరు నెలలుగా రాజౌరీ ప్రాంతంలో వరుస ఉగ్రదాడులు జరుగుతున్నాయి. తాజాగా దాడి వెనుక లష్కరే తోయిబా ముఠా ఉందన్న మాట వినిపిస్తోంది. బుధవారం పుల్వామా జిల్లాలో రోడ్డు పక్కన 25 కేజీల పేలుడు పదార్థాల్ని గుర్తించారు.

దీంతో మరో ఉగ్రదాడి కుట్ర భగ్నమైంది. ఈ పంద్రాగస్టుకు దేశంలో పలుచోట్ల ఉగ్రదాడికి ప్లానింగ్ చేస్తున్నారు. నిఘా వర్గాలు ఇలాంటి ప్రయత్నాల్ని నిర్వీర్యం చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు బుధవారం బడ్ గామ్ జిల్లాలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ముష్కరులు హతమయ్యారు.

WANTED
ADVERTISEMENT FRANCHISEES
VISAKHA SAMACHARAM
Telugu Daily
(www.visakhasamacharam.com)
(Published since 1990 & having properties worth Ten Crore Rupees) established at Visakhapatnam, Andhra Pradesh along with its Group wish to Award Franchise to Eminent, Talented, Hard working Persons at all the Important
TOWNS & CITIES ALL OVER INDIA.
ACTIVITIES
* Advertisements * Real Estate
* Solar Connections * Event Managements * Matrimony
* Ayurvedic Medicines
* Special Traditional Sweets
* Cultural Events
Investment : Rs/- 2,00,000/-
Attractive Revenue Assured
Interested Persons only can apply with biodata, present business activities, experience to 8247526179 by whatsapp

## (మొదటి పేజీ తరువాయిలు)

### అందుకే వారికి కడుపు మంట: సీఎం

విద్యలో కేంద్ర ప్రభుత్వాల గణాంకాల ప్రకారం... జీఈఆర్ రేషియో 84.48శాతం అయితే, దేశవ్యాప్త సగటు 99శాతం. ఈ లెక్కల ప్రకారం అట్టడుగున ఉన్న రాష్ట్రాలతో పోటీపడింది. ఈ పరిస్థితుల్లో మన పిల్లలు బాగా చదవాలనే ఉద్దేశంతో తల్లులకు తోడుగా ఉండాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని తీసుకు వచ్చాం. రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని ప్రచారం చేస్తున్నారు.

గతానికి, ఇప్పటికి పాలనలో తేడాను గమనించండి. అప్పుల్లో గ్రోత్ రేట్ గత పాలనలో 19శాతం సీఏజీఆర్ ఉంటే, ఇప్పుడు 15శాతం మాత్రమే ఉంది. అదే రాష్ట్రం, అదే బడ్జెట్, అప్పులు కూడా గతంతో పోలిస్తే తక్కువ.

**తేడా ఏంటి.. కేవలం ముఖ్యమంత్రిలో మార్పు**

**గతంలో వాళ్లు ఎందుకు చేయలేకపోయారు?**

మీ అన్న, మీ తమ్ముడు నేరుగా బటన్ నొక్కుతున్నాడు, నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి వెళ్తోంది

ఎక్కడా లంచాలు లేవు, వివక్షలేదు, డీబీటీ ద్వారా పోతుంది

**గతంలో జరిగే స్కీం ఏంటి?**

కేవలం నలుగురు మాత్రమే.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, ఒక చంద్రబాబు, వీరికి తోడు ఒక దత్తపుత్రుడు. వీరు మాత్రమే దోచుకో.. పంచుకో.. తినుకో.... డీపీటీ పథకం అప్పుడు అమలు చేశారు. ఈనాడు పేపర్ చదివినా, ఆంధ్రజ్యోతి చూసి, టీవీ%--%5 చూసినా.. వారి కడుపు మంట కనిపిస్తూ ఉంటుంది. గతంలో బాగా దోచుకుని పంచుకునే వాళ్లు. మనం వచ్చాక దోచుకోవడం లేదు, పంచుకోవడం లేదు కాబట్టి.. జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకనే వీరి కడుపు మంట కనిపిస్తోంది. వారికి లేనివి, నాకు ఉన్నవి.. దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులు.

### భారత 14వ ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్ ప్రమాణం

రావడంతో విజయం సాధించారు.

ఎవరీ జగదీప్ ధన్‌కర్? జగదీప్ ధన్‌కర్.. మే 18, 1951న రాజస్థాన్‌లోని ఝుంఝును ప్రాంతంలోని ఒక కుగ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన చిత్తోర్‌గఢ్‌లోని సైనిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. భౌతికశాస్త్రంలో పట్టా పొందిన తర్వాత రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బి చదివారు. మొదటి తరం ప్రొఫెషనల్ అయినప్పటికీ, అతను రాష్ట్రంలోని అగ్రశ్రేణి న్యాయవాదులలో ఒకరిగా ఎదిగారు.

1989 లోక్‌సభ ఎన్నికలలో ఆయన.. జనతాదళ్ టిక్కెట్‌పై ఝుంఝును నుంచి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యాడు. 1990లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. మాజీ ఉప ప్రధాని అయిన దేవి లాల్ నిజానికి ఆయన రాజకీయాలను ప్రభావితం చేశారు. 1993లో అజ్మీర్ జిల్లాలోని కిషన్‌గఢ్ నియోజకవర్గం నుంచి రాజస్థాన్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో గెలిచిన ధన్‌ఖర్ రాష్ట్ర రాజకీయాలపై తన దృష్టిని కేంద్రీకరించారు.

### ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా విశాఖను చూద్దాం

సహకరించి విశాఖ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి లక్ష్మీశా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు తెలిపారు. అందుకు నగర ప్రజలు కూడా సలహాలందించవచ్చని కోరారు. ఎగ్జిబిషన్ కమ్ సేల్ పేరిట 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మేళాలో 40 వరకు స్టాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచంలోనే ఇటువంటి ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మేళా జరగడంలో మన విశాఖే మొదటిదని తెలిపారు. కామర్స్ %డ% ఇండస్ట్రీ మహిళా విభాగంతో పాటు మెప్మా వంటి మహిళా సంఘాలు సహకరిస్తున్నాయని, ఏజెన్సీ నుంచి అడ్డాకులు, విస్తరాకులతో గిరిజనం వస్తున్నారని, వాళ్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిత్యం సాయంత్రం వేళ కళా బృందాల ప్రదర్శన ఉంటుందని, భాగస్వాముల్కైన వారందరికీ సర్టిఫికెట్లతో పాటు ఉత్తమంగా ఉన్న మూడు స్టాళ్లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంఎల్ఏలు ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులూ వస్తారన్నారు. జివిఎంసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశా ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ వై. శ్రీనివాస రావు, డిసి(రెవెన్యూ) ఫణిరాం, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, గ్రీన్ క్లైమేట్, ఎన్జిఒ జె వి రత్నం, జివిఎంసి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### యువత దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేయాలి

ఈ కార్యక్రమంలో ఆర్.టి.సి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సి.రవికుమార్, ఆర్.టి.సి రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు , సమాచార శాఖ ఉపసంచాలకులు వి.మణిరామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్ ను విద్యార్థులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

### ఉచిత పథకాలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

వినియోగించాలని కొందరు అనవచ్చని.. కాబట్టి ఇది తీవ్రమైన సమస్యని సుప్రీంకోర్టు పేర్కొంది. కాబట్టి ఇరు పక్షాల వాదనలను తాము నియమించిన కమిటీ వినాలని ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చెప్పారు.

ఉచితాలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు భారతదేశం పేదరికం ఉన్న దేశమని, ఆకలితో అలమటించే వారి విషయంలో కేంద్రానికీ ప్రణాళికలు ఉన్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే ఆర్థిక వ్యవస్థ దీని వల్ల డబ్బును కోల్పోతోందని, దీంతో ప్రజల సంక్షేమం సమతుల్యంగా ఉండాలని సీజేఐ రమణ అన్నారు. అంతకుముందు ఉచితాలపై దాఖలైన పిటిషన్లు కొట్టేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. అర్హత ఉన్న, వెనుకబడిన ప్రజల సామాజిక ఆర్థిక సంక్షేమం కోసం చేపట్టే పథకాలను 'ఉచితాలు'గా వర్ణించలేమమని పేర్కొంది.

# మాజీ రాష్ట్రపతి స్వర్గీయ వి.వి.గిరి జయంతి వేడుకలు



**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** ఆజాదీ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా స్వర్గీయ భారత రాష్ట్రపతి వి.వి.గిరి జయంతోత్సవాలను కలెక్టరు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.

జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు వి.వి.గిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1894 సంవత్సరంలో జన్మించిన వి.వి.గిరి విదేశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారని, భారత స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించారన్నారు. కార్మిక నాయకునిగా కార్మికహక్కుల కొరకు పోరాడినవ్యక్తి వి.వి.గిరి అన్నారు. భారత ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సేవలందించారని, రాష్ట్రపతిగా స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఘనత వి.వి.గిరి గారిదని తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు సంధర్భంగా దేశానికి సేవలందించిన మహాత్ములను, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని, వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం పనిచేయాలని తెలిపారు. దేశం కోసం పోరాడినవారి చరిత్రలను భావితరాలకు అందించాల్సిన భాద్యత ప్రతి భారతీయునిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి ఆర్. ఉమామహేశ్వర రావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వే పనులు వేగవంతం చేస్తున్నాం




**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లాలో రీ సర్వే పనులు వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వై.యస్ ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం - మీ భూమి మా హామీ కార్యక్రమం సమీక్షా సమావేశం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో గురు వారం సమీక్షా సమావేశం శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం రాష్ట్ర స్థాయి స్టీరింగ్ మరియు అమలు కమిటీ అధ్యక్షులు అజయ్ కల్లాం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 965 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయని, రీసర్వే చేయుటకు రెండు డ్రోన్ బృందాలు, మూడు జీసిపి బృందాలు ఉన్నాయని చెప్పారు. రోజుకు ఐదు చదరపు కిలో మీటర్ల మేర సర్వే జరుగుతోందని ఆయన చెప్పారు. కొద్ది రోజులుగా వాతావరణం పూర్తి స్థాయిలో అనుకూలించక జాప్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మొదటి విడతలో 22 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని ఆయన వివరించారు. రెండవ విడతలో 80 గ్రామాల్లో రీ సర్వే చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రీ సర్వేకు ఇంకా బృందాలను ఏర్పాటు చేసి శిక్షణ కల్పిస్తామని చెప్పారు. జిల్లాకు అదనంగా రోవర్లు, ఈటిఎస్ లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ కమీషనర్ సిద్ధార్థ్ జైన్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.విజయ సునీత, విజయ నగరం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెల పాలెం గ్రామంలో 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్. ఎల్. యన్. ఎల్. స్టీల్ ప్లాంట్ వారు స్టీల్ ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ ద్వారా సుమారు 2000 మామిడి, జామ, మరియు సపోటా మొక్కల పంపిణీ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ రౌతు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటుట వల్ల ప్రజలు ఆరోగ్యవంతులవుతారని, అలాగే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు ,ఆగ్రో ఫారెస్ట్ డి జి యం, వి ఎల్ పి.లాల్ ,సీనియర్ మేనేజర్ మిశ్రా ,స్టీల్ ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ ఉపాధ్యక్షులు ఆకుల నూకరాజు ,స్టోర్స్ బిజినెస్ మేనేజర్ యస్.బంగార్రాజు ,మరియు సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి అప్పికొండ వెంకట రమణ ,ఉపాధ్యక్షులు ఎల్లపు సాంబశివరావు సభ్యులు రౌతు రామచంద్ర రావు , ఎర్ర అప్పలరాజు ,గ్రామ పెద్దలు దాసరి రామారావు , కర్రీ జవ్వలు ,సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 67 మంది వాలంటీర్ల భర్తీకి చర్యలు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా లో జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న67 గ్రామ వాలంటీర్ల భర్తీకి చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 67 ఖాళీలు భర్తీతో అన్ని గ్రామ సచివాలయాలకు గ్రామ వాలంటీర్లు ఉంటారని తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలోని యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

గ్రామ వాలంటీర్ల భర్తీ కి ఆయా మండల అభివృద్ధి అధికారులు ఈ నెల 13వ తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తారని, 16 వ తేదీ నుండి 18వ తేదీ సాయంత్రం 05.00 గంటలవరకు దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. 20 వ తేదీన ధరఖాస్తులు పరిశీలించి 22వ తేదీన సెలక్షన్ కమిటీ మౌఖిక పరీక్ష నిర్వహిస్తుందని, ఎంపికైన అభ్యర్థులకు 23వ తేదీన తెలియజేసి 24వ తేదీన ఒక రోజు శిక్షణను ఇచ్చి 25వ తేదీన నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలలో గల ఖాళీలను వెల్లడించారు. జి.మాడుగుల మండలంలో 16, అడ్డతీగల మండలంలో 08, గంగవరం మండలంలో 06, పాడేరు, జి.కే. వీధి, మారేడుమిల్లి మండలాల్లలో ఐదేసి, చింతూరు మండలంలో 04, చింతపల్లి, కొయ్యూరు, వై రామవరంలలో మూడేసి, అరకు మండలంలో 02, అనంతగిరి, హుకుంపేట, కూనవరం, రాజవొమ్మంగి, రంపచోడవరం, వరరామచంద్రపురం, ఏటపాక మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున వలంటీర్ల ఖాళీలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

# కొత్తూరులో గడప గడపకు కార్యక్రమంలో అమర్నాథ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కొత్తూరు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు.భారీ సంఖ్యలో గ్రామస్తులు వెంటరాగా అమర్నాథ్ గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు మంజూరైన వివిధ పథకాలు అందచేశారు.కొన్నిచోట్ల సాంకేతిక కారణాల వలన పథకాలు అందని వారు ,తమ సమస్యలను మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన వాలంటీర్లను పిలిచి వారికి పథకాలు మంజూరు చేయడానికి వున్న అవకాశాలను పరిశీలించాలని అమర్నాథ్ ఆదేశించారు. ఒకవేళ పథకాలు రాకపోడానికి స్పష్టమైన కారణాలు వుంటే వారికి వివరించాలని మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా వృద్ధుల వద్ద కూర్చుని వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వాలంటీర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుండగా కొత్తూరు ఎంపీపీ స్కూల్ ను నాడు-నేడు పథకం కింద 20 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడానికి మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు. అలాగే అంగన్వాడీ భవనంలో సామాజిక కార్యక్రమాల్లో భాగంగా కే.లక్ష్మి, కే.విజయ, బి.సుధకు సీమంతం చేశారు.అంతకుముందు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని భారీ కేక్ కట్ చేసి బెలూన్స్ ఎగురవేసి ప్రారంభించారు..దారి పొడవునా మహిళలు మంత్రి అమర్నాథ్ కు హారతి పట్టి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మండల కార్యదర్శి బిశెట్టి జగన్, కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న- వరహాలు, ఎంపీటీసీలు వెలుగుల లక్ష్మి, మురుగుతి సంతోషి కుమారి- శ్రీను, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు, పేరపు సతీష్, ఎండిఓ చంద్రశేఖర్, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం 12-8-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయనం వర్ష రుతువు
శ్రావణ మాసం

పంచాంగం

తిథి : శు. పూర్ణిమ ఉ. 07.41
నక్షత్రం : ధనిష్ట తె. 04.01 వ.
వర్జ్యం : ఉ. 09.15 ల 10.46 వ.


సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నై నగరంలో ఉన్నారు.
సెల్ : 9440537607

# పిఠాపురంలో పీవీరావు సంతాప సభ




**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో రథాలాపేట అంబేద్కర్ సెంటర్లో మాల మృత వీరుల సంస్కరణ సభ పి.వి రావు మాల మహానాడు పట్టణ అధ్యక్షులు వేలంగి వెంకటేష్ ఆధ్వర్యంలో మాల మృతవీరులకు ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ అప్పట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీలను ఏబిసిడిలుగా విభజించడానికి ప్రయత్నం చేశారని దానిని వ్యతిరేకిస్తూ స్వర్గీయ పి.వి రావు ఆధ్వర్యంలో 1997 ఆగస్టు 11వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమంలో గుర్రాల తొక్కిసలాటలో అమరులైన పానంగి శేషయ్య, గోపతాటి నారాయణ దళితుల ఐక్యత కోసం తమ ప్రాణాలను అర్పించారని అలాంటి మృతవీరులను దళితులు ఎప్పుడూ మరవని పెర్కున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగు నూకరాజు, విజ్జిన చలపతి లారీ యూనియన్ ప్రెసిడెంట్ కొంగు శ్రీను, ఆలపు ప్రసాద్, మైనబత్తుల చిన్న, నింజరపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### షాప్సీ యొక్క తాజా టీవీసీ ప్రచారం 'ఆజ్ షాప్సీ కియా క్యా ?'(ఈ రోజు షాప్సీ చేశారా?)లో ముఖచిత్రంగా మారిన సారా అలీఖాన్

**బెంగళూరు, (విశాఖ సమాచారమ్):** భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈ-కామర్స్ వేదిక షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ నేడు తమ తాజా టీవీసీ ప్రచారం 'ఆజ్ షాప్సీ కియా క్యా?' (ఈ రోజు మీరు షాప్సీ చేశారా?)ను సారా అలీఖాన్ బ్రాండ్ ముఖచిత్రంగా విడుదల చేసింది. ఈ సారి మహిళా వినియోగదారుల విభాగంపై అధికంగా దృష్టి సారించి ప్రచార చిత్రం రూపొందించారు. ఈ ప్రచారంలో షాప్సీయొక్క వినూత్నమైన విలువ ప్రతిపాదన అయినటువంటి లభ్యత మరియు సరసమైన ధరలను వెల్లడించడంతో పాటుగా అందుబాటులోని విస్తృత శ్రేణి ఉత్పత్తుల లభ్యతను సైతం వినగానే గుర్తుండిపోయే రీతిలో 'హర్ దిన్ ఐసా సేల్ జైసా' అంటూ ఆకట్టుకునే వ్యాఖ్యలతో ప్రచారమూ చేయనున్నారు. సారా అలీఖాన్ కథానాయికగా తీర్చిదిద్దిన ఈ క్యాంపెయిన్ ద్వారా మహిళా వినియోగదారులను చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మరీ ముఖ్యంగా టియర్ 2 మరియు ఆపైన నగరాలను దేశవ్యాప్తంగా చేరుకోనున్నారు.

విస్తృత మైన మరియు విస్తారమైన రీతిలో వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని షాప్సీ ఈ ప్రచారం ప్రారంభించింది. ఈ ప్రచారం ద్వారా విలువ ఆధారిత షాపింగ్ కేంద్రంగా తమ స్థానాన్ని పటిష్టం చేసుకుంటూనే అత్యుత్తంగా అందుబాటు ధరల్లో డీల్స్‌ను సైతం అందిస్తుంది. ఇది ప్రతి రోజూ సేల్ అనిపించే రీతిలో ఉంటుంది. టిల్ట్ బ్రాండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తీర్చిదిద్దిన ఈ ప్రచారానికి ఓ యాడ్ చిత్రం నేతృత్వం వహిస్తుంది. దీనిని ప్రస్తుత మార్కెట్ యొక్క వాస్తవికత ఆధారంగా తీర్చిదిద్దారు. దీనిలో షాపర్లు వస్తువులను నిల్వ ఉంచడానికి మరియు అప్పుడప్పుడూ త్వరిత గతిన పరిష్కారమార్గమంటూ విక్రయాలు చేయడానికి అలవాటు పడ్డారు. అయితే వినియోగదారులు అన్ని సీజన్‌లలోనూ అత్యంత ఆకర్షణీయమైన ధరలకు అధిక విలువ కలిగిన ఉత్పత్తులను స్వీకరించినప్పుడు ఆశ్చర్యానికి గురువుతుంటారు.

ఈ ప్రకటన చిత్రంలో ఓ మహిళ, ఓ టైలర్ షాప్ వద్ద ఉండటంతో పాటుగా తన చీరను సరిగా కుట్టమని టైలర్‌ను అడుగుతుంది. దానిని పరిశీలించిన తరువాత ఆ టైలర్, ఆ చీరను తన సహాయకునికి విసిరి, దానిని కొత్తదానిలా మార్చి ఇస్తామని ఆ మహిళతో చెబుతాడు. సారా అలీఖాన్ ఆ చీర పట్టుకుని,ఈ చీరకు హంగులు చేర్చేబదులు కొత్త చీర కొనుక్కోవడం మంచిదని ఆ మహిళకు చెబుతుంది. ఆ మహిళ అవునా అని అడుగుతుంటే, ఆ టైలర్ మొహం చిట్లించుకుని చూస్తుంటాడు. త్వరలోనే అమ్మకాలు ప్రారంభం కానున్నాయని, అప్పటి వరకూ ఈ చీరతో సరిపెట్టుకుంటానని ఆమె చెబుతుంది. టైలర్ మొహంలో కాస్త ఉపశమనం కనిపిస్తుంది. అప్పుడు సారా తన ఫోన్ తీసుకుని చూపుతూ ప్రతి రోజూ షాప్సీపై అమ్మకాలు ఉంటాయని, ఎందుకు వేచి చూడాలని ప్రశ్నిస్తుంది?

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 12-8-2022


## కృతజ్ఞత

'కృతజ్ఞత ' అంటే ఒకరు మనకు చేసిన మేలును మరచి పోకుండా ఉండటం. మనం ఒక ప్రమాదకరమైన స్థితిలో ఉన్నప్పుడో, మనకు ఏదో ఒక సహాయం అవసరమైనపుడో, మనం అడిగితే సహాయపడేవారు కొందరుంటారు. మనం అడగకపోయినా మనకు అవసరమైన ఉపకారం చేసే వారు కొందరుంటారు. వీరికెప్పుడూ మనం కృతజ్ఞులమై ఉండాలి. కృతజ్ఞత అనేది మానవ సంస్కారం.

ఒకరు తమకు చేసిన ఉపకారాన్ని గ్రహించటం పుణ్యం, దానికి సమానమైన ప్రత్యుపకారాన్ని చేయటం మధ్యమం, ఉపకారానికి మించిన ప్రత్యుపకారం చేయటం ఉత్తమం.

ఏరు దాటాక తెప్ప తగలేసే చందంగా కాకుండా, మన ఉనికికి, ఉన్నతికి కారకులైనవారి పట్ల మనం కృతజ్ఞులమై ఉండాలి. ఒకనాడు మనకు మేలుచేసిన మనిషి, విధివశాత్తూ కష్టంలో పడినట్టు మనకు తెలిస్తే %--%అతని పట్ల సకాలంలో, అవసరానికి తగినట్టుగా స్పందించకపోతే అది కృతజ్ఞత ఎలా ఔతుంది.

మేలు చేసిన సమస్త జీవుల పట్ల కృతజ్ఞత, మేలు చేయడంలో ఆసక్తి కలిగి ఉండాలి. అంటే మనుషులకే కాదు పశువులు, పక్షులు, క్రిములు, కీటకాలు, చెట్లు, చేమలు, పాములు, తేళ్ళు.. ఇలా అన్నింటికి మేలు కలగాలనే భావన ఉండాలి. శత్రువైనా, మిత్రుడైనా ఎవరైనా సరే అందరి మేలును కాంక్షించి కృతజ్ఞత, దయ కలిగి ఉండాలి. ప్రాణులన్నింటికి దుఃఖాలు బాధలు సహజం. కనుక వాటి దుఃఖాన్ని తొలగించటానికి, సుఖాన్ని కలిగించటానికి, అవసర సమయాలలో మేలుచేయటానికి ప్రయత్నించాలి.

అయితే ఇలా సమస్త జీవుల పట్ల దయ కలగాలన్నా కష్టమే. మనకు మేలు చేసిన వారిపై అనురాగం కృతజ్ఞత ఉంటాయి. కనుక తిరిగి వారికి మేలు చేయాలనిపిస్తుంది. కాని మనకు కీడు చేసిన వారైతేనో వారికి కూడా మేలు చేయాలనుకుంటామా.. అనుకోలేము.

కాని వారియందు కూడా కృతజ్ఞతాభావం, మేలుచేయాలనే గుణం కలిగి ఉండాలన్నది శాస్త్ర ప్రమాణమని పెద్దలు చెబుతున్నారు.

ఇది వినటానికి బాగానే ఉంది. కాని ఆచరణకు వచ్చేటప్పటికి ఈ నీతి సూత్రాలన్నీ గుర్తుకు రావు. అయితే ఎవరికి సమబుద్ధి ఉంటుందో, అందరిని ఒకేవిధంగా, ఆత్మస్వరూపులుగా, ఒక్కటిగా చూడగలుగుతారో వారే అపకారులకు కూడా ఉపకారంచేస్తూ కృతజ్ఞత చూపగలుగుతారు. మేలు చేయాలనే ఆసక్తి కలిగి ఉంటారు. ఇలా జీవులకు చేసే హితం, సేవ పరమాత్మకు చేసినట్లే. ఎందుకంటే సమస్త జీవులయందు పరమాత్మే ఉన్నాడు గనుక.

కాలానికి మనం ఇచ్చే విలువ మన విలువను పెంచుతుంది. డబ్బుకు మనమిచ్చే విలువ ఆపదలో ఆదుకుంటుంది. సాటి మనిషికి మనం ఇచ్చే విలువ, చూపే కృతజ్ఞత వారి మనసులో మనకొక సుస్థిర స్థానం ఇస్తుంది.

అందువలన మనం అత్యాశను వదిలిపెట్టి సంతృప్తిని, కృతజ్ఞతను అలవరచుకోవటానికి ప్రయత్నించాలి. సంతృప్తితో జీవించేవారిని గౌరవించడం నేర్చుకోవాలి.

ఆనందమయమైన జీవితాన్ని గడపాలని ప్రతి ఒక్కరు కోరుకోవటం సహజం. దానికోసం ప్రతి ఒక్కరు ప్రయత్నిస్తూనే ఉంటారు. అయితే అతను తన ఆశకు పరిమితులని ఏర్పరచుకోవాలి.

అన్నీ ఉన్నా ఇంకా కావాలి, ఇంకా కావాలనుకోవడం వలన అతనికి ఆనందం లభించదు. సంతృప్తి ప్రతి వ్యక్తికీ తప్పనిసరిగా ఉండాలి. అది లేకపోతే ఎంత ఉన్నా మనిషికి ఆనందం ఉండదు.

కోరికలను పెరగనిస్తూ పోతే ప్రపంచంలోని వస్తువులన్నీ కూడా ఒక వ్యక్తికి చాలవు. అందువలన అత్యాశకు అవకాశం ఇవ్వకూడదు.

తనకు దక్కిన దానితో సంతోషపడటం ప్రతివ్యక్తి నేర్చుకోవాలి. అత్యాశ లేని వ్యక్తి చాలా సంతోషంగా ఉంటాడు. అరణ్యాలలో నివసించిన ఋషులు చాలా సంతోషంగా జీవించారు. అక్కడ భౌతిక సంపదలు లేవు. అయితే వారికీ సంతృప్తి అనే సంపద ఉన్నది. అది వారికి ఆనందాన్ని ఇచ్చింది. మనిషి ఆధ్యాత్మికంగా ఎదగాలంటే సంతృప్తి అవసరం. మన కోరికలను తగ్గించుకోవటం మీద మన సంతృప్తి ఆధారపడి ఉంటుంది.

## 1230 అడుగుల త్రివర్ణ పతాకంతో హెచ్‌పిసిఎల్ ఫ్లాగ్ మార్చ్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): గుండెల నిండా దేశభక్తిని నింపుకున్నారు. జాతీయ పతకాన్ని భుజానికెత్తుకున్నారు. విశాఖ సాగరతీరం వేదికగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పిసిఎల్) నిర్వహించిన ఫ్లాల్ మార్చ్ ఘనంగా నిర్వహించారు. 1230 అడుగుల పొడవైన, 375 మీటర్ల త్రివర్ణ పతాకంతో ఈ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఇంతటి భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించడం ఇదే ప్రథమం. వీటితో పాటు వేలాది జాతీయ పతాకాలను చేతపట్టుకుని యువతరం ఉత్సాహగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎంసిఏ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఉడా పార్క్ వరకు సాగింది. కేరళ సాంప్రదాయ వాద్య ఘోషతో సారగతీరం ఉత్తేజితమైంది.

హెచ్‌పిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ దేశాన్ని ఐక్యం చేసేది త్రివర్ణ పతాకమన్నారు. దేశ ప్రజలకు గర్వకారణంగా ఇది నిలుస్తోందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని హెచ్‌పిసిఎల్ ప్రారంభించడం, అందరి సహకారం తోడవటం జరిగిందన్నారు. దేశప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వీకరిస్తూ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

హెచ్‌పిసిఎల్ సిజిఎం(హెచ్ఆర్) కె.నగేష్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్వాతంత్ర్య సముపార్జనలో పాల్గొన్న యోధుల స్ఫూర్తిని, దేశభక్తిని నేటి తరానికి అదించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. జాతీయ జెండారు గౌరవించడం, విలువలను తెలుసుకోవడం ఎంతో ప్రధానమన్నారు.

కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ ఉన్నతాధికారులు,సంస్థ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు హెచ్‌పి శక్తి, హెచ్‌పి స్త్రీ, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, ఎస్‌డిఐ విద్యార్థులు, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు, యువత, నగర పౌరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 14న లక్ష పసుపు కొమ్ములతో నూకాంబిక అలంకరణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి జిల్లాలో వేంచేసియున్న శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం బహుళ పక్ష తదియ పూర్వాభాద్ర నక్షత్ర విశేష పర్వదినాన అనగా ఈనెల 14 న శ్రీ అమ్మవారి సన్నిధిలో పలువురు భక్తులు ప్రత్యేకంగా ఇచ్చిన లక్ష పసుపు కొమ్ములుతో చేసే అలంకరణలో భక్తులకు దర్శనము ఇవ్వనున్నారు. అమ్మవారి అలంకరణ కోసం పసుపు కొమ్ములతో మాలలు తయారు చేసే పనిలో భక్తులు నిమగ్నమయ్యారు. భక్తులు సౌభాగ్యము సిరి సంపదలు ప్రసాదించే సిరి శ్రీ మహాలక్ష్మి, త్రిశక్తి స్వరూపిణీ అయిన శ్రీ నూకంబిక అమ్మవారు ఆ రోజున పసుపు కొమ్ములతో కూడిన విశేష అలంకరణలో దర్శనమిస్తారు .కావున యావన్మంది భక్తులు శ్రీ అమ్మవారి దర్శనం చేసుకుని శ్రీ అమ్మవారి యొక్క కరుణాకటాక్ష వీక్షణాలు పొందవలసిందిగా ఆలయ కార్యనిర్వహణ అధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్, కోరారు.

## ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ బ్యాంక్ జాయింట్ కార్యదర్శిగా హరికృష్ణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శిగా స్థానిక వుడ్ పేట యూనియన్ బ్యాంక్ ఉద్యోగి అయిన కాండ్రేగుల హరికృష్ణ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన ప్రతిష్టాత్మకమైన యూనియన్ బ్యాంక్ మొదటి త్రైవార్షిక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శిగా కాండ్రేగుల హరికృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ జాయింట్ కార్యదర్శిగా నియమించిన ఆంధ్ర ప్రదేశ్ అండ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ టి రవీంద్రనాథ్ కి , ఏపీ జనరల్ సెక్రెటరీ ఉదయ్ కుమార్ కి విశాఖపట్నం రీజినల్ సెక్రటరీ వసంత రావు కి ఈ సంధర్భంగా హరికృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పాడేరు, (విశాఖ సమాచారమ్): ఈనెల 26,27,28 తేదీలలో విశాఖపట్నంలో జరుగు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర 27 మహాసభలను జయప్రదం చేయాలని, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, పార్టీ పాడేరు మండల కార్యదర్శి కుడ రాధాకృష్ణ ఒక ప్రకటనలు తెలిపారు. వారు మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమ నేపథ్యంలో 1925 డిసెంబర్ 26 కాన్పూర్ నగరంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆ ఉద్యమంలో అగ్రభాగాన్ని నిలుస్తూనే రైతులు ,బడుగు బలహీన వర్గాలు, మహిళలు, కార్మికులు, పేద మధ్యతరగతి ప్రజానీకం జీవితంలో వెలుగు నింపాలని మహా ఉజ్వల పోరాటాలు చేసింది. స్వతంత్ర అనంతరం కూడా అదే పంథాతో ముందుకు వెళుతున్న చరిత్ర ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీగా పేదల పక్షాన నిలుచొని రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని అలాంటి చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు విశాఖపట్నంలో జరుగుతుందని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

**జిల్లా సమితి సమావేశం ఈ నెల 16 చింతపల్లిలో**

అల్లూరి సీతారామరాజు జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి సమావేశం ఈనెల 16వ తేదీన మంగళవారం రోజు చింతపల్లిలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి పుట్టిక సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కే రాజు, మువ్వల లక్ష్మణరావు, బి రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సత్కారం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ గ్రంథాలయం సమావేశ హాలులో నాంది ఫౌండేషన్ ఇటీవల పదవ తరగతి పరీక్షలలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఎనిమిది మండలాలకు చెందిన 40 మంది విద్యార్థులకు, 25 మంది కమ్యూనిటీ అసోసియేట్స్ కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. నాంది ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ రాములమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థిలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా దిశా యాప్ పై బాలికల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 13వ తేదీన జరిగేఆజాదీ కా గౌరవ పాదయాత్ర



అరకులోయ, (విశాఖ సమాచారమ్): జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారు మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ ఆదేశాల మేరకు 75వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని.ఆజాదిక గౌరవ యాత్ర ఈనెల 13వ తేదీన శనివారం నాడు ఉదయము 10:00 గంటల నుండిఅరకు వ్యాలీ ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి పద్మపురం జంక్షన్ వయా డుంబ్రిగూడ మండలము అరుకు సంత బయలు వరకు పాదయాత్ర జరుగును కనుక అరకు వ్యాలీనియోజకవర్గ. కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు..నాయకులు . కాంగ్రెస్ పార్టీ అభిమానులు.కార్యకర్తలు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయగలరని కోరుచున్నాను. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంత కుమారి తెలియజేశారు.

## గాజువాక యమ్.వి.ఆర్. కళాశాలలో విద్యా దీవెన కార్యక్రమం ఏర్పాటు



గాజువాక, (విశాఖ సమాచారమ్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా గాజువాక నియోజకవర్గం ఎమ్ వి ఆర్ డిగ్రీ కళాశాలలో బీసీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి ,70 వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని,ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు చాలా మేలు చేకూరుతుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అలాగే ఈ పథకం ద్వారా గాజువాకలో 9742 మంది విద్యార్థులకు లబ్ది కలగడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ఉరుకూటి చందు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఎంతోమంది విద్యార్థులు లబ్ధి పొంది ఉన్నత విద్యను చదువుతున్నారని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణారావు,కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ,ఈశ్వర రాజు మరియు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 11.02 లక్షల విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జగనన్న విద్యా దీవెన పథకం 2022 ఏప్రిల్-జూన్ త్రైమాసిక కాలానికి గానూ మూడో విడత నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో కంప్యూటర్ మీట నొక్కి జమ చేశారు. గురువారం ఉదయం రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి పాల్గొని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెన క్రింద మొత్తం 11.02 లక్షల విద్యార్థులకు గాను రూ. 694 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. విశాఖ జిల్లాకు సంబందించి 47,822 మంది విద్యార్థులకు గానూ తమ తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.32.34 కోట్లు జమ చేయడం జరిగింది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా వెంటనే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లాలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, రాజకీయ ప్రతినిధులు, జిల్లా అధికారులు లతో కలిసి ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం విద్యార్థినీ,విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం కింద రూ.32.34 కోట్ల రూపాయల మెగాచెక్ జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన క్రింద జిల్లాలో ఎవరైన అర్హత కలిగి ఉన్న విద్యార్థుల తల్లులకు నగదు జమ కాకపోతే స్థానిక సచివాలయం లో ఫిర్యాదు చేసినచో వెంటనే పరిష్కారం చూపుతామన్నారు.

విశాఖ జిల్లాలో 47,822 మందికి గానూ 4,838 మంది ఎస్.సి విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.3.17 కోట్లు, 190 మంది ఎస్.టి విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.13.85 లక్షలు, 41,227 మంది బి.సి వెల్ఫేర్ విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ. 27.96 కోట్లు, 1326 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.87.70 లక్షలు, 235 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు వారి తల్లులు ఖాతాల్లో రూ.19.11 లక్షలు జమ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ మేయర్ కొటుమురు సతీష్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి అఖిల , పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీ.వీ.వీ. సత్యనారాయణమూర్తి, స్థానిక వార్డు కార్పొరేటర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అరటిపండు తొక్క తింటే.. క్యాన్సర్ రాదంట..!

బంగారు రంగులో ఉండే అరటి పండ్లను చాలా మంది ఇష్టపడుతూ ఉంటారు. ఇది ఎనర్జీ బూస్టర్ ఫుడ్. దీనిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ప్రతి రోజూ అరటి పండు తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిలో ఫ్యాట్స్, పిండిపదార్థాలు, ప్రోటీన్, ఫైబర్, పొటాషియం, ఫాస్ఫరస్, పెప్టిన్, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, విటమిన్-సి, విటమిన్-బి6 వంటి పోషకాలు ఉంటాయి. కొలెస్ట్రాల్ అసలు ఉండవు. హైపర్‌టెన్షన్ సమస్యతో బాధపడేవారికి అరటి పండు మేలు చేస్తుంది. బాగా పండిన అరటిపండు తింటే మలబద్ధకం ఉండదు. దీంట్లో ఉండే పెప్టిన్ పేగులకు మేలు చేస్తుంది. విరేచనం సాఫీగా జరిగేలా చూస్తుంది. దీంట్లో ఉండే ఫాస్ఫరస్ ఎముకలకు ఎంతో మేలు చేస్తుంది. నెలసరికి ముందు ఆందోళన, ఒత్తిడి, అలసటతో బాధపడేవాళ్లు దీన్ని తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. మనం సాధారణంగా అరటిపండు తిని.. తొక్కలూ పడేస్తాం.. అరటి పండు తొక్కలోనూ పోషకవిలువలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. అరటిపండు తొక్క తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని అమెరికన్ పోషకాహార నిపుణురాలు ఎరిన్ కెన్నీ అంటున్నారు. అరటిపండు



తొక్కలో పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్స్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని, ఇవి క్యాన్సర్‌కు కారణం అయ్యే.. ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయని అన్నారు.

**పేగులకు మంచిది..** అరటిపండు తొక్కల్లో రెండు రకాల ప్రీబయోటిక్స్, రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటాయని పోషకాహార నిపుణురాలు ఎరిన్ కెన్నీ అన్నారు. ఇవి పేగుల్లో చెడు బ్యాక్టీరియాను తగ్గించి, మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయని ఎరిన్ కెన్నీ చెప్పారు.

**ఫైబర్ రిచ్..** అరటి తొక్కల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుందని ఎరిన్ అన్నారు. మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి అరటి పండు తొక్కలు ఔషధంలా పనిచేస్తాయని చెప్పారు. పచ్చి అరటిపండు తింటే విరేచనాలు తగ్గుతాయని అన్నారు.

**యాంటీఆక్సిడెంట్స్ ఫుల్..** అరటిపండు తొక్కల్లో పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్స్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయని ఎరిన్ కెన్నీ అన్నారు. శరీర జీవక్రియను మెరుగుపరచడానికి ఇవ సహాయపడతాయని అన్నారు.

**క్యాన్సర్‌కు చెక్..** అరటిపండు మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో, దాని తొక్కలు అంతే ప్రయోజనకరంగా ఉంటాయని ఎరిన్ కెన్నీ అన్నారు. అరటి తొక్కలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అరటి తొక్కలు రెగ్యులర్‌గా తీసుకుంటే.. క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సహాయపడతాయి.

**కంటికి మంచిది..** అరటిపండు, వీటి తొక్కల్లో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. విటమిన్ ఏ కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రెటీనాలో వర్ణద్రవ్యాల్ని ఏర్పరచడానికి విటమిన్ ఏ ఉపయోగపడుతుంది. రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి, ఆరోగ్యకరమైన పునరుత్పత్తి వ్యవస్థ, చర్మ ఆరోగ్యానికి విటమిన్ ఏ ఎంతో అవసరం. రక్తనాళాల్లో మ్యూకస్ అనే పొరను విటమిన్ ఏ రక్షిస్తుంది.

**ఒత్తిడి దూరం..** అరటిపండు తొక్కల్లో ట్రిప్టోఫాన్ ఉంటుంది. ట్రిప్టోఫాన్ విచ్ఛిన్నమైనప్పుడు సెరోటోనిన్‌గా మారుతుంది, ఇది మీ మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. అరటి తొక్కల్లో విటమిన్ బి6 పుష్కలంగా ఉంటుంది.. విటమిన్ B6 నిద్రను మెరుగు పరచడంలో సహాయపడుతుంది.

# ఉదయం జీరా వాటర్ తాగితే.. ఎన్ని లాభాలో తెలుసా..?

సాధారణంగా ప్రతి వంటగదిలో కనిపించే మసాలా దినుసులలో జీలకర్ర ఒకటి. రోజువారీ జీవితంలో తాలింపులోనూ, మసాలాల్లోనూ జీలకర్రను ఎక్కువగా వాడుతూ ఉంటాం. ఇది ఆహారానికి అద్భుతమైన రుచిని ఇవ్వడమే కాదు, ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. జీలకర్రలో విటమిన్లు, మినరల్స్, సాల్ట్స్, యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్, ఎసెన్షియల్ ఆయిల్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. జీలకర్ర కడుపు సమస్యలను చాలా వరకు నయం చేస్తుంది. జీలకర్ర జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. జీలకర్ర వికారం, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. ప్రతి రోజూ ఉదయం జీలకర్ర నీరు తాగితే.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఒక స్పూన్ జీలకర్ర గింజలను.. ఒక గ్లాస్ నీటిలో వేసి మరిగించాలి, ఆ నీటిని చల్లార్చి గోరువెచ్చగా తాగితే ఆరోగ్యానికి మేలు జురుగుతుంది. బరువు తగ్గాలనుకునేవారు.. ప్రతిరోజూ జీలకర్ర నీరు తాగితే మంచి రిజల్ట్స్ ఉంటాయని అన్నారు. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తాగితే.. ఆరోగ్యానికి మంచిదని వివరించారు.



**గ్యాస్ సమస్యలు దూరం..** జీలకర్ర వాటర్ తాగితే.. ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, అజీర్ణం నుంచి ఉపశమనం లభిస్తుందని శిఖా అగర్వాల్ అన్నారు. జీలకర్రలో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపు నొప్పిని తగ్గించడంలో ఔషధంలా పనిచేస్తుంది. జీరావాటర్ జీర్ణ ఎంజైమ్‌ల స్రావాన్ని ప్రేరేపిస్తుంది, జీర్ణక్రియ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. జీలకర్ర నీరు తాగితే గట్ సమస్యలు దూరమవుతాయి.

**గర్భిణులకు మేలు చేస్తుంది..** జీరా వాటర్ గర్భధారణ సమయంలో జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీలకర్ర కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్స్ జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్‌లను పెంచుతుంది. గర్భదారణ సమయంలో ఎదురయ్యే చాలా సమస్యలను దూరం చేయడంలో జీలకర్ర సహాయపడుతుంది.

**పాల ఉత్పత్తి పెరుగుతుంది..** బాలింతలు.. జీరా వాటర్ తాగితే పాల ఉత్పత్తి పెరుగుతుంది. జీలకర్రలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది.

**ఇమ్యూనిటీ పెరుగుతుంది..** జీలకర్రలో ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. వర్షాకాలంలో జీలకర్ర నీరు తాగితే.. వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చు.

**డయాబెటిస్‌కు చెక్..** డయాబెటిక్ పేషెంట్స్‌కు జీలకర్ర నీరు మేలు చేస్తాయి. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయులు కంట్రోల్‌లో ఉంటాయి. జీలకర్ర శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

**శ్వాసకోశ వ్యవస్థకు మంచిది..** జీరా వాటర్ శ్వాసకోశ వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతుంది. జీలకర్ర రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ఛాతీలో పేరుకుపోయిన శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. మీకు శ్వాసకోశ సమస్యలు ఉంటే.. ఉదయం ఒక గాస్ జీలకర్ర నీరు తాగితే మేలు జరుగుతుంది.

**బీపీ కంట్రోల్ అవుతుంది..** జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రించడానికి పొటాషియం సహాయ పడుతుంది. దీంతో హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుంది.

# భోజనం తర్వాత నడిస్తే షుగర్ కంట్రోల్ అవుతుందా



సాధారణంగా నడక వల్ల బెనిఫిట్స్ ఎక్కువే. భోజనం తర్వాత నడవడం వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయి. వాకింగ్ వల్ల లాభాలనేవి తరతరాలుగా వస్తున్నాయి. మధ్యాహ్నం భోజనం తర్వాత చాలా మంది వాకింగ్ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల చాలా మంచిదని ముందు నుంచే చెబుతున్నారు. నడవడం వల్ల లాభాలు ఏంటనేవి ఓ వ్యక్తి పంచుకుంటున్నారు.

నేను భోజనం తర్వాత నడవాలని అమ్మమ్మ చెప్పేది. నిజానికి మధ్యాహ్నా భోజనం తర్వాత మా పెరట్లో ఉన్న మినీ గార్డెన్‌కి తన తోడుగా రమ్మని మా అమ్మమ్మ అడిగేవారు. అదే విధంగా చిన్నచిన్న మాటలతో నన్ను బిజీగా ఉంచేది.

ఓ పరిశోధన అధ్యయనం మా అమ్మమ్మ చెప్పిన మాటలని అర్థమయ్యేలా చేసింది. జర్నల్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురించబడిన మెటా విశ్లేషణ గుండె ఆరోగ్యం, ఇన్సులిన్, రక్తంలో చక్కెర స్థాయిపై కూర్చోవడం, నిలబడడం, నడక వంటి ప్రభావాలు ఉంటాయని తెలిపింది. ఎక్కువ సమయం కూర్చోవడంతో పోల్చితే, నిల్చోవడం వల్ల తరచుగా పోస్ట్ ప్రాండియల్ గ్లూకోజ్‌ని గణనీయంగా తగ్గించాయి. అయినప్పటికీ, కాంతిలో నడిస్తే శరీరానికి చాలా మంచిదని తేలింది.

మంచి లైఫ్‌స్టైల్ మంచి ఆరోగ్య ఫలితాలను ఇస్తుంది. ఎక్కువసేపు కూర్చోవడంలు అలవాటు అయితే ఆరోగ్యంపై ఎఫెక్ట్ పడతుంది. కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు జీవక్రియ ఎక్కువగా ఉండదు.

ఎక్కువసేపు కూర్చోవడం వల్ల 2హెచ్ గ్లూకోజ్, ట్రయాసిల్ గ్లిసరాల్, అధిక సాంద్రత కలిగిన లిపోప్రోటీన్(హెచ్‌డిఎల్) కొలెస్ట్రాల్‌తో ప్రతికూలంగా సంబంధం కలిగి ఉంటుంది. ఈ కారణంగా కార్డియో మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ఎక్కువసేపు కూర్చోవడం వచ్చే సమస్యలను, కొవ్వు నిల్వలను, జీవక్రియలను సూచిస్తుంది. మరో అధ్యయనం ప్రకారం సిస్టోలిక్ రక్తపోటు, హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్, ఇన్సులిన్, గ్లూకోజ్, ట్రైగ్లిజరైడ్స్, నడుము చుట్టుకొలత కూర్చోవడం వల్ల వచ్చే సమస్యలు. ఎక్కువసేపు కూర్చునే బదులు భోజనం అనంతరం కాసేపు నడవడం అనేది గ్లూకోజ్, ఇన్సులిన్ ప్రభావాన్ని తగించిందని పరిశోధనలు చెబుతున్నాయి.

ఎక్కువసేపు కూర్చోవడంతో పోలిస్తే అప్పుడప్పుడు నిల్చుని నడవడం వల్ల పోస్ట్ గ్లూకోజ్‌ని గణనీయంగా తగ్గిస్తుంది. కానీ పోస్ట్ ప్రాండియల్ ఇన్సులిన్ బీపిపై గణనీయమైన ప్రభావాన్ని చూపలేదు.

**అధ్యయనం ప్రకారం..** జాబ్ చేసేవారు వర్కౌట్స్ చేయడం లేదు. కానీ, అది ఎప్పుడు మంచిది కాదు. మీరు కచ్చితంగా మినీ వాకింగ్ ఎంచుకోవాలి. ఎందుకంటే, నడవడం వల్ల శరీరం అలసిపోతుంది. ఉదయం చేయడం వల్ల అద్భుత ఫలితాలు ఉంటాయి. మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు కూడా శారీరక శ్రమ ఉండడం లేదు. కాబట్టి వారు జిమ్‌కే వెళ్ళాల్సిన అవసరం లేదు. కాఫీ తాగుతూ నడవడం, హాలులో షికారు చేయడం వంటి చిన్న చిన్న పనులు కూడా చేయొచ్చు. దీని వల్ల బరువు కంట్రోల్‌లో ఉంటుంది షుగర్ వంటి సమస్యలు రావు. వచ్చినా షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి.

కచ్చితంగా మంచి జీవనంతో పాటు మంచి అలవాట్లు ఉండడం వల్ల ఎన్నో సమస్యల్ని దూరం చేసుకోవచ్చు.

# ఇలా చేస్తే క్షణాల్లో నిద్రపోతారట



నిజానికి చాలా మంది నిద్ర విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఎప్పుడు కూడా సరిగ్గా నిద్ర పట్టక పోవడం పదే పదే భయంకరమైన ఆలోచనలు రావడం తీవ్రమైన ఒత్తిడి తో సతమతం అవ్వడం లేదంటే గజిబిజిగా ఉండటం ప్రశాంతత లేక పోవడం వంటివి ఎదుర్కొంటూ ఉంటారు. అలానే ఒత్తిడి లేకుండా ఆనందంగా నిద్ర పోతే చక్కగా ఆనందంగా మనం ఉండొచ్చు అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిజానికి అలా ఉంటే ఆరోగ్యం దెబ్బ తింటుంది పైగా మంచి నిద్రని కూడా పొందలేము.ఇటువంటి సమస్యలు కలిగి ఉన్న వాళ్ళు చక్కటి పద్ధతిని అనుసరిస్తే మంచి బయట పడొచ్చు ప్రతి రోజు రాత్రి నిద్రపోయే ముందు ఇలా ఇబ్బంది పడే వాళ్లు స్పిరిచ్యువల్ లీడర్ ఫౌండర్ ఆఫ్ ఏ ఐ ఆర్ ఇన్స్టిట్యూట్ అఫ్ రియలైజేషన్ రవి కొన్ని టిప్స్ చెప్పారు

వీటిని కనుక మీరు ఫాలో అయ్యారంటే హ్యాపీ గా ఉండడానికి అవుతుంది దానితో పాటుగా చక్కటి నిద్రని కూడా పొందొచ్చు. ఎంతో ప్రశాంతంగా ఆనందంగా ఉండొచ్చు. అలానే నాణ్యమైన నిద్రని కూడా పొందడానికి అవుతుంది. అయితే మరి ఈ టిప్స్ ని ఫాలో అవ్వాలి కష్టంగా ఉంటాయా అని మీరు ఆలోచించొద్దు ఇవి చాలా సులభంగా ఉన్నాయి. పైగా ఎవరైనా సరే వీటిని ఫాలో అవ్వొచ్చు.

**ప్రతీ రోజు మెడిటేషన్:** చాలా సార్లు మీరు ఈ విషయాన్ని వినే వుంటారు. మెడిటేషన్ వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది అని. నిజంగా మెడిటేషన్ వల్ల ఎన్నో అద్భుతమైన లాభాలను మనం పొందొచ్చు. ప్రతి రోజూ మెడిటేషన్ చేయడం వల్ల ప్రశాంతంగా ఉంటుంది. మెదడుకు ఎంతో నిశబ్దంగా మారుతుంది సాధారణంగా మన మెదడు 50 ఆలోచనలను ప్రొడ్యూస్ చేస్తుంది అది కూడా ఒక నిమిషంలో. అంటే రోజుకి 50 వేల ఆలోచనలు వరకు మనకు వస్తూ ఉంటాయి. కోతి లాగ మన యొక్క ఆలోచనలు ఒక దగ్గర నుంచి మరొక దగ్గరికి ఉరుకుతూ ఉంటాయి. మన మెదడు కనుక ఇలా పని చేస్తూ ఉంటే మనకు నిద్ర పట్టదు. అయితే ఎప్పుడైతే మెంటల్ థాట్ రేట్‌ని తగ్గించుకుంటారో అప్పుడు చక్కగా ప్రశాంతంగా ఉండడానికి అవుతుంది. యాభై ఆలోచనల నుంచి ఒక ఆలోచన కి తీసుకు వస్తే చక్కగా ప్రశాంతంగా ఉండొచ్చు మంచిగా మెడిటేషన్ చేయడం వల్ల రిలాక్స్‌గా ఉండొచ్చు. అలానే నిద్రలేమి సమస్య నుండి కూడా బయట పడొచ్చు.

**ఇతర లాభాలు:** ఆనందంగా ప్రశాంతంగా ఉండడానికి మెడిటేషన్ సహాయ పడుతుంది.

అదే విధంగా మీ యొక్క ఏకాగ్రతను కూడా పెంపొందించుకోవడానికి అవుతుంది.

ఆందోళన తగ్గి మీరు కుదుట పడవచ్చు.

మెడిటేషన్ తో స్వచ్ఛమైన స్థితిని అనుభవించడానికి కూడా అవుతుంది. ప్రశాంతంగా మీ మనసు ఉంటుంది.

అలానే కమ్యూనికేషన్ కూడా బాగా జరిగేటట్టు చేస్తుంది మెడిటేషన్.

ఈ మధ్య కాలంలో ఎక్కువమంది ఒత్తిడి తో ఇబ్బంది పడుతున్నారు అటువంటి వారు ప్రతి రోజు మెడిటేషన్ చేయడం వల్ల చక్కటి ఫలితాలను పొందవచ్చు. అయితే మెడిటేషన్ చేసేటప్పుడు ఖచ్చితంగా ఈ చిట్కాలు ఫాలో అవ్వండి. వీటిని ఫాలో అయితే మంచిగా మెడిటేషన్ చేయడానికి అవుతుంది.

మెడిటేషన్ చేసేటప్పుడు ఎవరు డిస్టర్బ్ చేయని చోట కూర్చోండి. అప్పుడు మీరు ఏకాగ్రత పెట్టడానికి అవుతుంది.

అలానే మీ పరిసరాలు కూడా నిశ్శబ్దంగా ప్రశాంతతనిచ్చేలా ఉండాలి.

ఉదయం మరియు సూర్యాస్తమయం అయ్యే సమయం మెడిటేషన్ చేయడానికి మంచిది అలానే మీరు మెడిటేషన్ చేసేటప్పుడు కంఫర్ట్ గా కూర్చోవాలి. అప్పుడే మీరు మెడిటేషన్ చేసేటప్పుడు ఏకాగ్రత పూర్తిగా పెట్టడానికి అవుతుంది.

మెడిటేషన్ చేసే ముందు ఏమీ తినకండి అప్పుడు మెడిటేషన్ బాగా చేయొచ్చు.

మొదట మెడిటేషన్ చేసేటప్పుడు మీరు ఈజీగా ఉండే వ్యాయామాలతో స్టార్ట్ చేయండి మెడిటేషన్ చేసేటప్పుడు ఆనందంగా నవ్వుతూ చేయండి ఇలా ఈ చిట్కాలను ఫాలో అయ్యారంటే కచ్చితంగా బాగా మెడిటేషన్ చేయడానికి అవుతుంది.

**పాజిటివ్ ఎమోషన్స్** : ఎప్పుడూ కూడా పాజిటివ్ ఎమోషన్స్‌ని కలిగి ఉండండి. ఇవి కూడా మిమ్మల్ని ఆనందంగా ప్రశాంతంగా ఉంచుతాయి. పాజిటివ్ ఎమోషన్స్ అయినటు వంటి ప్రేమ, ధైర్యం, నమ్మకం, విశ్వాసం ఇలాంటి వాటిని కలిగి ఉండడం వల్ల చక్కగా మీరు పాజిటివ్ ఆలోచనల తో ఉంటారు అలానే ప్రశాంతంగా కూడా ఇవి మిమ్మల్ని ఉంచుతాయి. ఎప్పుడైనా సరే నెగిటివ్ ఎమోషన్స్ వచ్చాయంటే వాటిని మీరు పాజిటివ్ ఎమోషన్స్‌తో మార్చుకోండి. నెగిటివ్ ఆలోచనలు మరియు ఎమోషన్స్‌ని పాజిటివ్ ఆలోచనలు మరియు ఎమోషన్స్‌తో రీప్లేస్ చేస్తే చక్కటి ఫలితాన్ని మీరు పొందొచ్చు.

ఒక సారి కావాలంటే మీరు ఇలా ప్రయత్నించి చూడండి. పైగా ఎప్పుడైనా సరే మంచి ఆలోచనలతో ఆనందదాయకమైన ఆలోచనలతో ఉంటే చక్కటి నిద్రని పొందొచ్చు. అంతే కాదండి యాంగ్జైటీ, ఒత్తిడి నుంచి దూరంగా ఉండి మంచి నిద్రను పొందడానికి అవుతుంది చాలా మందికి ఈ విషయం తెలియదు. ఎప్పుడూ కూడా చికాకుగా కోపంగా నిద్రపోతూ ఉంటారు. దాని వల్ల అస్సలు నిద్ర పట్టదు. పైగా మంచి ఎమోషన్స్ మంచి ఆలోచనలు కలిగి ఉంటే హ్యాపీగా ఉండొచ్చు. ఎంతటి బ్యాడ్ మూడ్ అయినా సరే వెంటనే మారి పోతుంది. అందుకని కచ్చితంగా ఇలా ప్రయత్నం చేసి చూడండి. అప్పుడు మంచి నిద్ర పొందొచ్చు. అలానే మీ ఆరోగ్యం కూడా బాగుంటుంది. శారీరకంగా మానసికంగా కూడా ఎన్నో లాభాలను మీరు దీని వల్ల పొందొచ్చు.

**రెగ్యులర్‌గా యోగా:** చాలా మందికి యోగా అంటే ఎంతో భయం. యోగాలో వివిధ భంగిమలు ఉంటాయని వాటిని చేయడం కష్టమని అనుకుంటారు. అయితే యోగా అంటే కేవలం ఆసనాలు మాత్రమే కాదు. శారీరక వ్యాయామంతో పాటుగా ప్రాణాయామం, బ్రీతింగ్ టెక్నిక్స్ వంటివి కూడా ఉంటాయి. నిజానికి బ్రీతింగ్ ఎక్సర్సైజ్ మరియు ఆసనాలు మిమ్మల్ని బాగా నిద్ర పోవడానికి సహాయ పడతాయి. అయితే నిజానికి ఈ యోగా గురించి భయ పడే వాళ్ళు ఆ భయాన్ని వదిలేసి దీన్ని ఫాలో అయ్యారంటే మంచి నిద్రను పొందడానికి అవుతుంది. ధ్యాన యోగ, భక్తి యోగ, కర్మ యోగ, జ్ఞాన యోగ లేదా ప్రేమ యోగ ద్వారా మనం మొదలు పెట్టొచ్చు. దైవానికి కనెక్ట్ అయితే ప్రశాంతంగా ఉండొచ్చు. అలానే ఆనందం కూడా వస్తుంది ఇలా యోగ ద్వారా కూడా చక్కగా ప్రశాంతంగా ఉండొచ్చు. ఒత్తిడి నుండి దూరంగా ఉండొచ్చు. శారీరకంగా మానసికంగా కూడా ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. కనుక మంచి నిద్ర పొందాలనుకునే వాళ్ళు మంచి ఆలోచనల తో ప్రశాంతంగా ఉండాలి అనుకునే వాళ్ళు ఒత్తిడి నుండి దూరంగా ఉండాలి అనుకునే వాళ్ళు యోగాని కూడా ప్రయత్నం చేసి చూడొచ్చు. దీని ద్వారా చక్కటి లాభాలను పొందవచ్చు.

నిజానికి ఈ మధ్య కాలంలో చాలా మంది ఇంట్లో పనులు, ఆఫీసు లో పనులు వల్ల ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడిలో కూరుకుపోవడం వల్ల ఆనందమే ఉండడం లేదు. అలాంటి ఇబ్బందులు ఏమీ కలగకుండా ఉండాలంటే వీటిని అనుసరించటం మంచిది.

**నిజాన్ని తెలుసుకోవడం** : రియలైజేషన్ ఆఫ్ ట్రూత్ అనేది ఎంతో ముఖ్యమైనది మనం మన గురించి నిజం తెలుసుకోవాలి అలానే మన ఆత్మ ఇం మోర్టల్ పవర్ ఇటువంటివి తెలుసుకుని ఉండాలి. ఒక సారి నిజంగా మనకి మనం ఏమిటి అనేది తెలిస్తే ఖచ్చితంగా ఆనందంగా ఉండడానికి అవుతుంది. చూశారు కదా మంచి నిద్రని ఎలా పొందాలి, మంచి మూడ్ ఎలా తీసుకు రావాలి , ఒత్తిడి లేకుండా ఎలా ఉండాలి, యాంగ్జైటీ ని ఎలా దూరం చేసుకోవచ్చు అనేది. మరి ఈ చిట్కాలు ఫాలో అయ్యి ఆనందంగా ఉండండి అలానే వీటిని అనుసరించడం వల్ల ఒత్తిడి ఉండదు. మంచి నిద్రని కూడా పొందొచ్చు.

**చివరగా...** యోగా, మెడిటేషన్, పాజిటివ్ ఆలోచనలు ఇవన్నీ కూడా మనల్ని మంచిగా మారుస్తాయి. చెడు ఆలోచనలు దూరమవ్వడం మొదలు మానసిక ప్రశాంతత వరకు ప్రతి ఒక్కరు పొందడానికి అవుతుంది. కనుక తప్పని సరిగా వీటి కోసం మీ యొక్క సమయాన్ని కేటాయించండి దాంతో ఆనందంగా ఉండడానికి అవుతుంది. అలానే మంచి నిద్రను పొండమే కాక శారీరకంగా మానసికంగా కూడా అద్భుతమైన లాభాలను పొందవచ్చు. ఈ చిన్న చిన్న మార్పులు మీ యొక్క జీవన విధానంలో మార్చుకుంటే సమస్యలు ఉండవు అందుకని ఎంత బిజీ లైఫ్‌లో ఉన్నా సరే వీటి కోసం కొద్దిగా సమయాన్ని కేటాయిస్తే అద్భుతమైన మార్పును మీ జీవితంలో చూడొచ్చు.

# ఇంట్లోనే అల్లోవెరా జెల్ తయారు చేసుకునే సులభమైన పద్ధతి ఇదే



ప్రకృతిలో లభించే ఔషధాల్లో అల్లోవెరా ఆరోగ్యానికే కాదు చర్మ సంరక్షణకు సైతం అధ్భుతమైన పరిష్కారం. అల్లోవెరాను ఇంట్లోనే సహజసిద్ధంగా తయారు చేసుకుంటే ఇంకా మెరుగైన ఫలితాలుంటాయి. ఆ విధానం మీ కోసం..

అల్లోవెరా. అద్భుతమైన ఔషద గుణాల మొక్క. ఇంట్లో కుండీల్లో కూడా పెంచుకోగలిగే అనువైన మొక్క ఇది. ఇది కేవలం ఆరోగ్యానికే కాదు..చర్మ సంరక్షణకు కూడా చాలా మంచిది. అల్లోవెరా మొక్క ఆకుల్లో నీటిని జెల్ రూపంలో భద్రపరుస్తుంది. ఈ జెల్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తుంది. దాంతోపాటు స్కార్స్, సన్‌బర్న్, మచ్చలు, పిగ్మెంటేషన్, డ్రై స్కిన్ సమస్యలకు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. అందుకే చాలా కంపెనీలు కొద్దిగా ప్రిజర్వేటివ్స్ చేర్చి లక్షలాదిరూపాయలు సంపాదిస్తుంటారు. అయితే అల్లోవెరాను ఇంట్లోనే సహజసిద్ధంగా తయారు చేసుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి మరింత మంచిది. ఇంట్లో అల్లోవెరా ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం..

**అల్లోవెరా జెల్ తయారీ ఎలా** : అల్లోవెరా తయారీ కోసం అల్లోవెరా ఆకులు, బ్లెండర్, ఎయిర్‌టైట్ బాక్స్, విటమిన్ సి లేదా విటమిన్ ఇ పౌడర్. ఓ వారం రోజుల కోసం మాత్రమే తయారు చేసుకోవాలి. ముందుగా అల్లోవెరా ఆకుని 3-4 ముక్కలుగా కట్ చేసుకోవాలి. తరువాత ఆ ముక్కల్ని ఏదైనా పళ్లెంలో నిలబెట్టి కొద్దిసేపుంచాలి. దీనివల్ల ఇందులో పేరుకుని ఉండే పసుపు రంగు జిగురు బయటికొచ్చేస్తుంది. ఎందుకంటే ఈ జిగురు మంచిది కాదు. తరువాత అల్లోవెరా శుభ్రం చేసుకుని పైభాగంలో ఉండే ఆకుపచ్చని తొక్కను తొలగించాలి.

**మరోసారి శుభ్రం చేసుకోవాలి** : ఇప్పుడు తొక్క ఒలిచిన అల్లోవెరా నుంచి జెల్‌ను స్పూన్ సహాయంతో తీసి బ్లెండర్‌లో వేయాలి. లిక్విడ్‌గా మారేవరకూ బ్లెండ్ చేయాలి. ఇలా చేసిన అల్లోవెరా వారం రోజులవరకూ ఉపయోగపడుతుంది. ఇందులో కొద్దిగా విటమిన్ సి, విటమిన్ ఇ పౌడర్ కూడా కలపవచ్చు. ఎందుకంటే ఈ రెండింట్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఏజియింగ్ గుణాలు అధికం. అల్లోవెరా చర్మ సంరక్షణకు అద్భుతంగా పనిచేస్తుంది.

# శ్రీకాకుళంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల నిర్బంధం

**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):** సిపిఎస్ రద్దు కోసం, 117 జీవో రద్దు కోసం, పాఠశాల విలీన ప్రక్రియ వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ ఈరోజు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం దిగ్బంధించింది. ఏపీటీఎఫ్ కార్యకర్తల నినాదాలతో కలెక్టర్ కార్యాలయం ముఖద్వారం వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీనితో పోలీసులు ఉపాధ్యాయులను అరెస్టు చేసి ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. మూడు నాలుగు ఐదు తరగతుల విలీన ప్రక్రియ పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు విద్య దూరమవుతుందని, ముఖ్యమంత్రి గారి హామీ మేరకు సిపిఎస్ ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు సిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి పేర్కొన్నారు. . అన్ని పాఠశాలలలో తెలుగు ఆంగ్ల మాధ్యమాలు కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కొరకు జీవో నెంబర్ 117 లోని అసంబద్ధ విధానాలను తొలగించాలని,మూడు నాలుగు ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనాన్ని రద్దు చేయాలని ఏపీటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్ బాబు మాట్లాడుతూ.సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలనీ కోరారు. ప్రభుత్వ, పంచాయితీరాజ్, మునిసిపల్, గురుకుల పాఠశాలలలో తెలుగు, ఆంగ్లమాధ్యమాలను రెండింటినీ కొనసాగించాలనీ,11వ పి.ఆర్.సిలో ఫిట్మెంట్ను 27%కి తగ్గకుండా మంజూరు చేయాలనీ, ఏపీటిఎఎఫ్ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు బి ఢిల్లేశ్వర్ రావు, పేర్కొన్నారు.ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జరుగుతున్న 100 రోజుల ఉద్యమ కార్యక్రమం లో భాగంగా




నేడు శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ ముందు జరుగుతున్న పికెటింగ్ లో ఏపీటిఎఫ్ శ్రేణులు విస్తృతంగా పాల్గొన్నాయి. వివిధ మండలాల కార్యకర్తలు ఈరోజు పికెటింగ్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యదర్శి చావలి శ్రీనివాస్ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ-రాష్ట్రంలో విద్యారంగాన్ని సంక్షోభంలో నెట్టేసిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఉపాధ్యాయుడు ఉద్యమించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ పాఠశాలను నిర్వీర్యం చేసే జీవో 117 ను తక్షణమే రద్దు చేయాలని, మూడు నాలుగు ఐదు తరగతులను హై స్కూల్లో విలీనం చేసే ప్రక్రియను నిలుపుదల చేయాలని, శాస్త్రీయ విద్యా విధానానికి బాటలు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలనీ, కరోనాతో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలనీ, ప్రావిడెంట్ ఫండ్, ఏ.పి.జి.ఎల్.ఐ. డి.ఎ బకాయిలు, సంపాదిత సెలవు, మెడికల్ రీయింబర్స్మెంట్, గత కాలపు ఎరియర్లు మొదలైన వాటిని వెంటనే చెల్లించాలనీ,మునిసిపల్ ఉపాధ్యాయులకు పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలనీ. ప్రధానోపాధ్యాయులకు,డి.డి.ఓ అధికారాలను ఇవ్వాలి. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలనీ ఐ.టి.డి.ఎ పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలనీ. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలనీ,పేర్కొన్నారు. మళ్లీ పుట్టి మండల శాఖ అధ్యక్షులు టి కామేశ్వరరావు మాట్లాడుతూ నేడు విద్యారంగ సంక్షోభ పరిస్థితులను ప్రతి ఉపాధ్యాయుడు అవగాహన చేసుకుని సంక్షోభము నుండి బయటపడడానికి ఎపిటిఎఫ్ చేస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, మున్సిపల్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులకు డిడిఓ అధికారాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల సొసైటీలు, మోడల్ స్కూల్స్, కె.జి.బి.విలలో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు విధానాలను రద్దుచేయాలనీ. అన్ని సొసైటీలను విద్యాశాఖలో విలీనం చేయాలనీ. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వాన్ని ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఈరోజు జరిగిన పికెటింగ్ కు భయపడి ఉపాధ్యాయులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు, యస్ చాణక్య, వి నవీన్ కుమార్, డి వీరయ్య,మక్క గంగేశ్వరీ, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు, ఎల్ కరుణాకర్, జి భీమారావు, బొడ్డేపల్లి నేతాజీ రావు, సీనియర్ నాయకులు, కె వేణుగోపాలరావు, హెచ్ వి సత్యనారాయణ, కవిటి పాపారావు, బి వి రమణ, కే వెంకటరమణ, యు శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాస్, ఆర్ శంకర్రావు, ఎ తాత నాయుడు, చింతాడ ధర్మారావు, టి రామన్నాయుడు, దుంపల సంధ్యారాణి, టి ఎర్రమ్మ, వి రామారావు, చిట్టి త్రినాధరావు, వాసుపల్లి రామారావు, రాజేష్ పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌కు రాఖీలు కట్టిన మహిళా నేతలు



**అమరావతి:** రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) సందర్భంగా సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హోంమంత్రి తానేటి వనిత, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్రమాని విజయనిర్మల, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మహిళా కమిషన్ సభ్యులు కర్రి జయశ్రీ, గెడ్డం ఉమ రాఖీలు కట్టారు.వీరితో పాటు ఈశ్వరీయ బ్రహ్మకుమారి ప్రతినిధులు రాజయోగిని బ్రహ్మకుమారి శాంత దీదీ జీ, సిస్టర్స్ పద్మజ, మానస.. సీఎంకు రాఖీలు కట్టారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సెప్టెంబర్‌లో మౌంట్ అబూలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రిని బ్రహ్మకుమారి ప్రతినిధులు ఆహ్వానించారు.

# జెఇఇ, నీట్‌కు బైజూస్ శిక్షణ

**విజయనగరం:** జిల్లా విద్యార్థులకు ఒక గొప్ప అవకాశం లభించింది. జిల్లాకు చెందిన 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి జెఇఇ, నీట్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఎడ్యుకేషనల్, టెక్నో కంపెనీ బైజూస్ ముందుకు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు బైజూస్ సంస్థ ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తుందన్నారు. నీతి అయోగ్ ఏస్పిరేషనల్ జిల్లా కావడంతో, విజయనగరం జిల్లా విద్యార్థులకు ఈ అరుదైన అవకాశం వచ్చిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపికను పూర్తిచేసి, ఈ నెల 16 నుంచి శిక్షణను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మరో 5వేల మందికి ఉచితంగా పాఠ్యాంశాలను, కంటెంట్‌ను అందించేందుకు కూడా బైజూస్ ముందుకు వచ్చిందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా, నైతిక విలువలను, సత్ప్రవర్తనను, జీవితానికి అవసరమైన ఇతర అంశాలను కూడా బోధించాలని సూచించినట్లు తెలిపారు. అందివచ్చిన ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

**నీట్, జెఇఇ కి శిక్షణకు ఎంపికలు**

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పదోతరగతి, ఇంటర్ చదువుతున్న అత్యుత్తమ ప్రతిభగల విద్యార్థులను బైజూస్ శిక్షణకు ఎంపిక చేయనున్నారు. విద్యార్థులకు స్క్రీన్‌టెస్టు నిర్వహించి, 25 మంది బాలురు, మరో 25 మంది బాలికలను ఎంపిక చేయనున్నారు. బాలికల్లో కెజిబివి విద్యార్థినులకు ప్రాధాన్యత ఇస్తారు. సమగ్ర శిక్ష ఎపిసి, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఎంపిక చేసిన విద్యార్థులకు బైజూస్ రెండేళ్లపాటు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ విధానంలో ఉచితంగా శిక్షణ అందిస్తుంది. ప్రతీరోజూ సాధారణ తరగతుల అనంతరం వీరికి కనీసం రెండున్నర గంటలపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. దీనికోసం బైజూస్ సంస్థ జిల్లాలో కేర్‌టేకర్లను నియమిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా బైజూస్ ట్యాబ్‌లను, పాఠ్యాంశాలను అందిస్తుంది. డిజిటల్ క్లాస్‌రూమ్‌లో తరగతులు నిర్వహిస్తారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా రెండు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని వసతులనూ కల్పించనున్నారు. జిల్లాలో శిక్షణ పొందుతున్న స్పెషల్ డిప్యుటీ కలెక్టర్, ఈ శిక్షణా కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

**మరో 5వేల మందికి విద్యా సహకారం**

అందరికీ విద్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సుమారు 5వేల మంది విద్యార్థులకు పాఠ్యాంశాలను అందించేందుకు బైజూస్ ముందుకు వచ్చింది. ఎంపికైన విద్యార్థులు తమ సెల్‌ఫోన్ లేదా ట్యాబ్ లో బైజూస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, మూడేళ్లపాటు వారికి అవసరమైన పాఠ్యాంశాలను ఉచితంగా అందించనుంది. నాల్గవ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులెవరైనా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఈ శిక్షణకు కూడా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. సమగ్ర శిక్ష పిఓ, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ద్వారా ఈ ఎంపికను పూర్తి చేసి, ఆగస్టు నెలాఖరు నాటికి వీరికి బైజూస్ ద్వారా పాఠ్యాంశాలను అందించనున్నారు.

# విద్యా దీవెన క్రింద రూ.11.62 కోట్లు జమ

**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం కింద 2022 సంవత్సరం మొదటి త్రైమాసికానికి 22,584 మంది విద్యార్థులకు 11.62 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది. ఇందులో వెనుకబడిన తరగతుల విద్యార్థులు 14,077 మందికి రూ.7.68 కోట్లు, ఎస్టీ విద్యార్థులు 4,864 మందికి రూ.1.89 కోట్లు, ఎస్సీ విద్యార్థులు 2,725 మందికి రూ.1.43 కోట్లు, ఈబీసీ విద్యార్థులు 670 మందికి రూ.43.79 లక్షలు, కాపు విద్యార్థులు 209 మందికి రూ.16.53 లక్షలు, ముస్లిం మైనారిటీ విద్యార్థులు 30 మందికి రూ.2.18 లక్షలు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు 9 మందికి 68 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా జమ చేయడం జరిగింది. ఇందులో పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన 6,266 మంది విద్యార్థులకు రూ.3.51 కోట్లు, సాలూరు




నియోజకవర్గానికి చెందిన 4,339 మంది విద్యార్థులకు రూ.2.22 కోట్లు, కురుపాం నియోజకవర్గానికి చెందిన 5,926 మంది విద్యార్థులకు రూ.2.96 కోట్లు, పాలకొండ నియోజకవర్గానికి చెందిన 6,053 మంది విద్యార్థులకు రూ.2.93 కోట్లు వారి తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగింది. జగనన్న విద్యా దీవెన క్రింద ఆర్థిక సహాయాన్ని బాపట్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేశారు.పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు పూర్తి ఫీజ్ రీ ఇంబర్సుమెంట్ పొందుతున్నారని చెప్పారు. విద్యార్థులు విద్యా దీవెన మొత్తాన్ని కళాశాలకు చెల్లించాలని సూచించారు.గాయత్రి కళాశాలలో బీస్సి చదువుతున్న విద్యార్థి ఆశిష్ గౌతమి మాట్లాడుతూ దేశంలో ఒక గొప్ప పథకం అని పేర్కొన్నారు. విద్యా పరంగా ముఖ్య మంత్రి ఎన్నో మార్పులు వచ్చాయి తీసుకు వచ్చారని తెలిపారు. ప్రతి విద్యార్థి తను కలలు కన్న విద్య అభ్యసించాలని ముఖ్య మంత్రి కోరిక అని పేర్కొన్నారు. అవకాశాలు ఉపయోగించు కోవాలని సూచించారు.సాయిరాం డిగ్రీ కళాశాలలో చదువుతున్న భారతి మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పేద కుటుంబమని పైచదువులు కష్టమని భావించాను. అయితే ముఖ్య మంత్రి అమలు చేసిన విద్యా దీవెన, వసతి దీవెన భరోసా ఇచ్చిందని ఉన్నత చదువులకు అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ప్రతి ఫలం చూపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండల పరిషత్ అధ్యక్షులు బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కిరణ్ కుమార్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, ఇన్ ఛార్జ్ మునిసిపల్ కమీషనర్ విద్యార్థులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గడప గడప కు సంక్షేమ పథకాలు ద్వారా అభివృద్ధి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు అమలు తీరును వాటిని పొందుతున్న ప్రజలనే నేరుగా కలిసి తెలుసుకుంటూ వారికి గల సమస్యల పరిష్కారానికి సహితం చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మన సీఎం వైయస్ జగన్ నీ మళ్లీ సీఎం గా ఆశీర్వదించాలి అని ప్రజలకు అభ్యర్థన.అజ్జాడ సచివాలయం పరిధిలో మురగడాం గ్రామంలో 4వ రోజున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టేందుకు విచ్చేసిన గౌ, ఎమ్మెల్యే శ్రీ అలజంగి జోగారావు గారికి పూలమాలలు వేసి గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికిన గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలుబి ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామంలో గడప గడపకి వెళ్లి ప్రజలను కలుసుకుని, వారు పొందుతున్న సంక్షేమ పథకాల తీరును పరిశీలిస్తూ, అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వం సంక్షేమం అందేలా చర్యలు తీసుకుంటూ ప్రతీ గడపలో ప్రజల వద్దనుంచి దీవెనలు స్వీకరిస్తున్నారుబిబలిజిపేట రూరల్: అజ్జాడ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుసారథ్యంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంను ఈరోజు ఉదయం అదే సచివాలయం పరిధిలో గల మురగడాం గ్రామంలో ఎమ్మెల్యే గారి సారథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమానికి తమ గ్రామం విచ్చేసిన ఎమ్మెల్యే కి గ్రామ ఉప సర్పంచ్ రణదేవ్ లక్ష్మణా, ఎంపీటీసీ సభ్యులు అక్కేన గణేష్, ఎక్స్ సర్పంచ్ అక్కేనా యల్లంనాయుడు, నాయకులు పెంకి ఈశ్వరరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు అంతా కలిసి ఎంతో అభిమానంతో ఎమ్మెల్యే గారికి ఏదురొచ్చి మరీ పూలమాలలతో, శాలువాలతో సత్కరించి ఘనంగా గ్రామంలోకి స్వాగతం పలికి ప్రధాన వీది వద్ద నుంచి గడప గడపకు కార్యక్రమం ప్రారంభం చేసారు.ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడప గడపకు వెళ్లి మన సీఎం వైయస్ జగన్ గారి నాయకత్వంలో 3 ఏళ్ల పరిపాలన కాలంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాన్ని తెలియచేయడంతో పాటు ప్రతీ గడపలో ఆయా కుటుంబ సభ్యులు పొందుతున్న పథకాల వివరాలతో సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి గారు సంతకం చేసిన కరపత్రాన్ని స్వయానా ఎమ్మెల్యే చేతులు మీదుగా లబ్ధిదారులకు అందచేసి కుటుంబంలో ఇంకా ఎవరైనా అర్హత కలిగి సంక్షేమ పథకాలను పొందలేక పోతున్నారా? అన్న విషయం తెలుసుకుని అర్హత ఉంటే తప్పక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ మన గౌ, సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి గారిని మీరంతా మనస్ఫూర్తిగా మరొకసారి దీవించాలి అని మళ్లీ సీఎం గా గెలిపించు కోవాలని కోరడం జరిగినది. అలానే ప్రతీ గడప వద్దనా ప్రజలకు అందుతున్న పథకాలపై ఆరాతీస్తూ, అవి సవ్యంగా అందుతున్నవీ లేనిదీ, అలానే ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సహితం చర్యలు తీసుకోవడంతో పాటుగా తన పరిధిలో ఉన్న సమస్యలకు అక్కడికి అక్కడే ప్రజల గడప వద్దనే పరిష్కారం చేసి చూపి ప్రజల మన్ననలు చూర గొంటున్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల జడ్పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపీపీ గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీ వి సాయిరాం, మండల పార్టీ అధ్యక్షులు పి మురళీకృష్ణ, సర్పంచ్లు కురిటి మోహనరావు, పోల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గులిపిల్లి శారద, పిఎసిఎస్ చైర్మన్ ఏ వెంకటరమణ, వైసీపీ సీనియర్ నాయకులు తప్పిట ప్రసాద్, గుడివాడ జగన్, గుల్ల లక్ష్మణరావు, తెంటు వెంకటప్ప అప్పలనాయుడు, జీ శంకర్రావు, మండల అధికారులు అర్డబ్ల్యుఎస్ ఏఈ వనజాక్షి, హౌసింగ్ ఇన్స్పెక్టర్, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 13న త్రివర్ణ పతాక ర్యాలీ




**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 13వ తేదీన భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డిఆర్ఓ సమీక్షించారు. 13వ తేదీ ఉదయం 7 గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, క్రీడాకారులు, ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్, శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. సత్యం నాయుడు, జిల్లా విద్యా శాఖ అధికారి పి. బ్రహ్మాజీ రావు, క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వేంకటేశ్వర రావు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాము, ఎస్.వి.డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతి రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, కలెక్టర్ కార్యాలయ ఏఓ ఆర్. ఉమామహేశ్వర రావు, తహశీల్దార్ శివన్నారాయన తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ అవగాహన సదస్సు, ర్యాలీ

**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా రావికోన మరియు బట్టివలన గ్రామంలో న్యాయఅవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించారు.

అవగాహన సదస్సు కార్యక్రమంలో గిరిజనులకు వారి హక్కులగురించి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, సీనియర్ న్యాయవాదులు జి. వెంకటరావు, జోగారావు, జూనియర్ న్యాయవాది పరశురాం మరియు పారాలీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# అజది అమృత మహోత్సవం




**పార్వతీపురం, మన్యం, (విశాఖ సమాచారమ్):** ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా బుధవారం రావికోన మరియు బట్టివలన గ్రామంలో న్యాయఅవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించారు. అవగాహన సదస్సు కార్యక్రమంలో గిరిజనులకు వారి హక్కులగురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, సీనియర్ న్యాయవాదులు జి. వెంకటరావు, జోగారావు, జూనియర్ న్యాయవాది పరశురాం మరియు పారాలీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మంచిపుస్తకాలను చదవటం మహా అదృష్టం మంచిని గుర్తించకపోవడం దురదృష్టం

కాయగూరలలో పుచ్చులున్నట్టే పుస్తకాలలోకూడా మంచి చెడులుంటాయి.

సిరాతో రాస్తే రచన

బుర్రతోచేస్తే యోచన

యాచనచేసి రచనరాస్తే చదువరి ఆలోచనలో పడాలి

ఆలోచనలోపడేయగలిగినవాడే రచయిత

పడేయలేనివాడుంటాడు కలుగులోఎలుకలా

నిజమైనకవి ఉంటాడు పాఠకులనాలుకలా

ఉదాహరణచేప్పాలంటే నాలా

అక్షర సత్యామృతం చదివిన కామేశ్వరిగారి మాటలిలా ఉన్నాయి.

నా86 ఏళ్ళవయసులో ఇలాంటిమధురపుస్తకంఇంతవరకు చదవలేదు

ఒక్క అక్షరంకూడా వదలకుండా చదివించిన బుక్ ఇది నన్నేకాదు ప్రతిఒక్కరిని చదివించితీరుతుంది.

కళ్ళు మనసు పుణ్యంచేసుకుంటేతప్పా ఇలాంటిబుక్ చదవలేరు.

నువ్వునాలాంటి వృద్ధులకు తరచూ అన్నదానం చేస్తున్నందుకు అభినందిస్తున్నాను.

అమ్మగా ఆశీర్వదిస్తున్నాను ఆనందిస్తున్నాను.

ఈమాటలు 5 ఏళ్ళక్రిందటే చెప్పారు.

దేవుడుకరుణించినా పూజారి అడ్డుకున్నాడనే నానుడిని నిజం చేసాడో పూజారి.

అవ్వలకు అనాధలకు అన్నం పెడుతున్న బుక్ ని అమ్మకండి అన్నాడు ఆ పూజారి.

భక్తులు ఆసక్తిగా బుక్‌ని కొంటుంటే బుల్ లా అడ్డుకోవడం ఎంతవరకు న్యాయం ?

అష్టలక్ష్మి గుడి పూజారిగారు మాఇంట్లో 2000 పుస్తకాలు ఒకపక్క మీ అక్షర సత్యామృతం మరోపక్క ఉంటుంది మావాళ్లకి బాగానచ్చింది.

నాకు తెలిసిన పూజారులు మానసచోరులు.

కొందరు నాలాంటివారిపొట్టకొట్టే అసురులు.

నిన్న హీరో మహేష్ బాబు జన్మదినకవిత కొన్నివేలమందిని ఆకట్టుకుంది.

## హిమ శేఖర్ కళాశాల ఆధ్వర్యంలో ఆజాదికా అమృత మహోత్సవ భారీ ర్యాలీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆజాదికాఅమృత మహోత్సవంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్థానిక రింగ్ రోడ్డులోనున్న శేఖర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారంభారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల ఎన్ సి సి ,ఎన్ఎస్ఎస్ యూనిట్లు తో సహా సుమారు వెయ్యి మంది విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకొని ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీకి అగ్ర భాగాన భారతమాత శకటం అనంతరం దేశ స్వాతంత్ర సమరంలో కీలక పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ వివేకానంద స్వామి అల్లూరి సీతారామరాజు వేషధారణలో మరో శకటం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కొణతాల జనార్ధన్, డైరెక్టర్ కొణతాల చిన్నికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ కే రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో అసువులు బాసిన అమరవీరులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని దేశభక్తిలో వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. భారతమాతబిడ్డలుగాదేశ ప్రగతికి ప్రతి విద్యార్థి నాంది పలకాలని కోరారు. స్థానిక రింగ్ రోడ్డు వద్ద ప్రారంభమైన ర్యాలీ రైల్వే స్టేషన్ రోడ్డు రామచంద్ర థియేటర్ నెహ్రూ చౌక ఎన్టీఆర్ జంక్షన్ వేదుక మెయిన్ రోడ్డు మీదుగా రింగ్ రోడ్డు ఎంఎం కాంప్లెక్స్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కే ఉసానందిని ,ఎన్ సిసి ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ ధర్మలింగం ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎంజి రాజ్ కుమార్, కే శ్రీధర్, అధ్యాపకులు కేబి వి పరమేశ్వరరావు కే ఫణి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 42, 745 మంది విద్యార్థులకు24 కోట్ల విద్యా దీవెన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన కు సంబంధించి ఏప్రిల్ - జూన్ 2022 మాసాల ఫీజ్ రీయింబ ర్స్మెంట్ ను బాపట్ల లో నిర్వహించిన కార్యక్రమం నుంచి బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసారు. కలెక్టర్ కార్యాలయంలో జగనన్న విద్యా దీవెన పథకం ఏప్రిల్ - జూన్ 2022 మాసాల ఫీజ్ రీయింబర్స్మెంట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. జిల్లాలో 42, 745 మంది విద్యార్థులకు రూ. 24 కోట్ల 28 లక్షల 72 వేల 707 మంజూరు చేయగా అందులో 38,560 మంది బీసీ విద్యార్థులకు రూ.22 కోట్ల 8 లక్షల 86 వేల 47లు, 3341 మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 1 కోటి 79 లక్షల 81 వేల 377లు, 583 ఎస్.టి విద్యార్థులకు రూ.24 లక్షల 18 వేల 460లు, 261 మంది మైనార్టీ విద్యార్థులకు రూ. 15 లక్షల 86 వేల 823 లు ఖాతాలలో జమ చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.సి. సంక్షేమ శాఖ అధికారి అజయ్ బాబు, జిల్లా బి.సి. సంక్షేమ అధికారిణి రాజేశ్వరి, వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## పండ్ల మొక్కలను పంపిణీ చేసిన కార్పోరేటర్ శ్రీనివాస్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం లో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం స్టీల్ ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ ద్వారా సుమారు 2000 మామిడి, జామ, మరియు సపోటా మొక్కలను పంపిణీ చేపట్టారు .ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ ప్రతినిధులు ,ఆగ్రో ఫారెస్ట్ డిజిఎం .లాల్ ,సీనియర్ మేనేజర్ శ్రీ మిశ్రా ,స్టీల్ ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ ఉపాధ్యక్షులు ఆకుల నూకరాజు ,స్టోర్స్ బిజినెస్ మేనేజర్ బంగార్రాజు ,మరియు సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి అప్పికొండ వెంకట రమణ ,ఉపాధ్యక్షులు ఎల్లపు సాంబశివరావు సభ్యులు రౌతు రామచంద్ర రావు ఎర్ర అప్పలరాజు ,గ్రామ పెద్దలు దాసరి రామారావు కర్రీ జువ్వలు ,సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## 13న ఆర్.సి.యం నుండి త్రివర్ణ పతాక ర్యాలీ

**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 13వ తేదీన భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహణపై డిఆర్ఓ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ ఉదయం 7 గంటలకు ఆర్.సి.యం సెయింట్ పీటర్స్ హై స్కూల్ వద్ద ర్యాలీ ప్రారంభమై గాంధీ బొమ్మ జంక్షన్ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. ర్యాలీలో 120 అడుగుల త్రివర్ణ పతాకాన్ని ఊరేగింపుగా తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, క్రీడాకారులు, ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్, శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.











# శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.




## కార్డోరియం ప్లస్

కావల్సిన వారు సంప్రదించండి:

9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.

మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.

అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

# చదరంగం క్రీడాకారిణి సాహితికి అభినందనలు




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ నుంచి అతిచిన్న వయస్సులో అంతర్జాతీయ చదరంగం పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ ఉమెన్ మాస్టర్ అర్హత సాధించింది.

ప్రపంచ స్థాయి చెస్ టోర్నమెంట్ లో పాల్గొని విశాఖ వచ్చిన సందర్భం'గా చిన్నారి చదరంగ ఆటగాళ్ళ వివిధ స్కూల్స్, ఇంట్రాక్ట్ క్లబ్ కిడ్స్ క్రియేట్ చిన్నారులు వచ్చి అత్యంత ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ సెక్రటరీ జగన్మోహన్, డిస్ట్రిక్ బాలిక వికాస అధ్యక్షురాలు మోదాంబికా, జే.సి. శాంతి, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ అలేఖ్య లహరి, ఇంట్రాక్ట్ రిప్రజెంటేటివ్ ఉజ్వల్ మరియు చిన్నారులు పూలమాలతో సత్కరించారు. విశాఖలో చదరంగం ఆటగాళ్ల కు స్ఫూర్తిదాయకంగా వుంటుందని అన్నారు.

# ఘనంగా గ్రామదేవత మరిడిమాంబఅమ్మవారి పండగ





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణ ప్రజలు గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గవరపాలెం శ్రీ నూకంబిక ఆలయం వద్ద, కోట్ని వీధి, గవరపాలెం శతకం పట్టు వద్దనున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయాలకు ప్రజలు వేకువ జాము నుండి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.కోట్నీ వీధి వెలిసిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు, అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, వైసిపి అధ్యక్షులు మందుపాటి జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పలకా రవి, జాజుల రమేష్, కోరుకొండ రమేష్,ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అప్ప కొండ రవిశంకర్, 84వ వార్డు ఇంచార్జ్,వైసీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ,కరణం శ్రీనివాసరావు, ధర్మకర్తలు, అలాగే గవరపాలెం మరి డిమాంబ అమ్మవారిని మంత్రి అమర్నాథ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు ఎల్లపు రమణ బిఎస్ఎంకే జోగి నాయుడు మంత్రికి సాధన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శతకం పట్టు మరిడిమాంబ అమ్మవారు భక్తుల తాకిడితో ఆలయ ప్రాంతమంతా సందడిగా మారింది. అమ్మవారి పండగ సందర్భంగా కోటిని వీధిలోను పట్టు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

పాడేరు, (విశాఖ సమాచారమ్): అల్లూరి సీతా రామరాజు జిల్లా, హుకుంపేట మండలం గ్రామగ్రామన ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగారాలని బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు మత్స్య కొండ బాబు పిలుపు నిచ్చారు, గురువారం హుకుంపేట మండలం మతం పంచాయతీ జాకారవలస గ్రామం లో ఈ రోజు ఇంటి ఇంటికి తిరిగి గిరిజన ప్రజలకు జాతీయ జెండా లను ఉచితం గా అందించడం జరిగింది, ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగిరించి మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలని, వారి ప్రాణ త్యాగమే నేటి మన స్వాతంత్ర్య భారతం అన్నారు, అనంతరం డూరువీధి గ్రామం లో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆజాదిక అమృత మహోత్సవం యొక్క విశిష్టతను తెలియజేయ్యడం జరిగింది, ఈ కార్యక్రమం లో సంబంధిత పాఠశాల సిబ్బంది, బీజేవైఎం నాయకులు మజ్జి అనిల్ కుమార్, జన్ని శివకుమార్, కొర్ర శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
టెండరు ప్రకటన నెం. eT-North-WAT-13-2022 తేది. 08.08.2022
పని పేరు: వాల్తేరు డివిజన్‌లో రాయపూర్-విజయనగరం లైను నందు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/రాయగడ వారి పరిధిలో సర్పీపురం స్టేషన్ వద్ద ప్లాట్ ఫారంలు విస్తరణ /'ఎంచుట మరియు ప్లాట్ ఫారం ఉపరితలం, ఫెన్సింగ్‌కు రిపేర్లు వగైరా.
సుమారు పని విలువ: ₹ 1,96,24,864.59, బయానా: ₹ 2,48,100/-, పని పూర్తి చేయు కాలం: 06 (ఆరు) నెలలు
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 06.09.2022న 1330 గంటలకు
ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.
సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు/సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయుటమైనది.
పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్), వాల్తేరు
PR-376/N/22-23

# నేరెళ్ల వలస రైతులు ఆర్డీఓ కి వినతిపత్రం



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): బలవంతపు భూసేకరణ ఆపాలని పద్మనాభం మండలం నేరెళ్ల వలస రైతులు అర్డీవో గారికి వినతి పత్రం సమర్పించారు రైతులకు ఎటువంటి ముందు నోటీసులు ఇవ్వలేదని చెప్పారు.ఈ భూమి మాకు జీవనాధారం అని ఇది లేకపోతే మా తల్లిదండ్రులు భార్య పిల్లలు రోడ్లు పడతామని రైతాంగం వాపోయారు ఈ భూమి లేకపోతే మా బ్రతికే లేదని ఈ భూమి ద్వారానే ఇన్నేళ్లు జీవించగలిగే మని పెళ్ళిళ్ళు చేసుకున్నామని కావున సదరు భూమి నీ రైతులకు ఉండేవిధంగా క్రింద అధికారులను ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాము అని రైతులు తెలిపారు స్థానికంగా బలవంతంగా అధికార పార్టీ నాయకులు అధికారు రైతులను భయపెట్టి భూ సేకరణ చేయడం అన్యాయమని అన్నారు ల్యాండ్ పోలింగ్ మీద సిపిఎం పార్టీ గతంలో కోర్టు వెళ్లిందని కోర్టు రైతుల వద్ద నుండి బలవంతంగా భూసేకరణ చేయకూడదని చెప్పిందని అందుచేత పద్మనాభ మండలం నేల వలస పంచాయితీలో రైతుల భూములను ల రైతులకు ఉండే విధంగా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవ్వ నరసింగరావు రైతులు వదిన ప్రసాద్, ముళ్ళు నారాయణ అప్పుడు, పెరుగు బాబు కొట్టాను శంకరరావు మండల ఆనందరావు గన్ రేటు స్వామి నాయుడు కేవల సూర్యనారాయణ కొట్టాను దుర్గా ముళ్ళు సతీషు లు పాల్గొన్నారు.

# చదువుకుంటేనే తలరాతలు బతుకులు మారతాయి




పాడేరు, (విశాఖ సమాచారమ్): చదువుతోనే తలరాతలు బతుకులు మారతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు . జగనన్న విద్యాదీవెన ఏప్రిల్ , మే , జూన్ 2022 త్రైమాసిక ఫీజు రీయింబర్స్మెంటును గురువారం బటన్ నొక్కి బాపట్ల నుండి తల్లుల ఖాతాలకు జమ చేసారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే మందిని చదివించాలని చెప్పారు . విద్యాపరంగా , సామాజిక పరంగా , రక్షణ పరంగా అన్ని రకాలుగా అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తున్నామన్నారు . ఎంత మంది బిడ్డలున్నా చదివించే బాధ్యత తీసుకుంటానన్నారు . ప్రతీ ఇంటి నుండి ఇంజనీర్ , డాక్టర్ కలెక్టర్ బయటకు రావాలాన్నరు . జగననన వసతి దీవెన , విద్యా దీవెన , పథకాలకు రూ .11.715 కోట్లు ఖర్చు చేసామన్నారు . ఐటిడి ఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ , పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి , అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ ఈ కార్యక్రమాన్ని ఐటిడి ఏ సమావేశ మందిరం నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు . ఈ సందర్భంగా ఐటిడి ఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఐటిడిఏ లక్ష్యమన్నారు . ముఖ్యమంత్రి ఆలోచన , ప్రభుత్వ ఆశయాల మేరకు గిరిపుత్రులకు సివిల్స్ , నీట్ , ఐ ఐటి , జె ఇ ఇ , లాసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామన్నారు . ఈ ఏడాది వంద మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు . గిరిజన విద్యార్థులు మంచి నడవడిక అలవాటు చేసుకోవాలని సూచించారు . నాడు నేడు కింద మొదటి దశలో 367 పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది , మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు . ముంచింగ్ పుట్టు జూనియర్ కళాశాలకు రూ .1 కోటి 40 లక్షలు , అరకువ్యాలీ డిగ్రీ కళాశాలకు రూ .1 కోటి 50 లక్షలతో అదనపు వసతి , ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు .

: పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్య లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు . విద్యారంగంలో అమ్మ ఒడి , సంపూర్ణ పోషణ , గోరుముద్ద , విద్యాకానుక , మన బడి నాడు నేడు , ఇంగ్లీషు మీడియం పాఠశాలలు తీసుకుని వచ్చారన్నారు . బైజూస్తో ఒప్పందం , ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు . ప్రభుత్వం పేదలు ఆర్థికమైన ఇబ్బందులు పడకుండా ఫీజు రీయింబర్స్మెంటు చేస్తోందన్నారు . దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజురీయింబర్స్మెంటున్న ప్రారంభించారని ఆయన తనయుడు కొనసాగిస్తున్నారన్నారు . జగనన్న బడుగు వికాసం పథకంలో ప్రభుత్వ ఆర్థి సహాయాన్ని పొంది చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు . పాడేరు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నారు . అమ్మ ఒడి , విద్యాదీవెన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు . ఐటిడి ఏ పి ఓ అందిస్తున్న సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు . చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు . పాడేరు , అరకు నియోజక వర్గాల పరిధిలో 9696 మంది తల్లుకు రూ .3 కోట్ల 77 లక్షలు జగనన్న విద్యాదీవెన జమ చేయడం జరిగిందన్నారు . శాసన సభ్యులకు సన్మానం ఎం ఎల్ ఎలు భాగ్యలక్ష్మి , చెట్టిపాల్గుణ , ఐటిడి ఏ పి రోణంకి గోపాల క్రిష్ణలను వెల్ఫేర్ అసిస్టెంట్లు శాలువాలు కప్పి సన్మానించారు . వారి సర్వీసు ప్రొబేషన్ డిక్లేర్ చేసారని సి ఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేసారు . అనంతరం అతిధుల చేతుల మీదగా జిల్లా వ్యాప్తంగా 11,702 మంది తల్లుకు జమ చేసిన అమ్మ ఒడి రూ .4 కోట్ల 77 లక్షల 98 వేల నమూనా చెక్కునా చెక్కును తల్లులకు అందజేసారు . ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రావు , డి . ఇ . ఓ డా . రమేష్ , వైస్ , ఏటిడబ్లూ ఓ ఎల్ . రజని , ఎంపిపి కనకాలమ్మ , ఎంపిటిసి విజయ లక్ష్మి , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**విశాఖ సమాచారమ్**
చదవండి చదివించండి
సెల్: 9393949345, 8247526179

# ఘనంగా శ్రీను సిద్ధాంతి జన్మదినం





భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ శ్రీను సిద్ధాంతి 50వ జన్మదిన వేడుకలు దాకమర్రి శ్రీ లక్ష్మి వల్లభ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణం లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . ఆధ్యాత్మిక రంగంలో దాకమర్రి ప్రకాష్ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. శ్రీను సిద్ధాంతి వంటి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేడుకలు దాకమర్రిలో జరపడం ఎంతో ఆనందదాయకమన్నారు. శ్రీ సద్గురు సమర్థ శ్రీ సాయి సుందర మహారాజు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని భక్తులకు అందించారు. నగర సంకీర్తన, నాదస్వరం, గీతా పారాయణం, సాధు సత్పురుషులకు సత్కారం, కోలాటాలు, చెక్క భజనలు, చిడతలు, ఆధ్యాత్మి గీతాలు భక్తి రంజని భజన కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 5000 మందికి అన్నదానం చేశారు. అనంతరం పేదలకు వృద్ధులకు కళాకారులకు భక్తులకు వస్త్రాలు పండ్లు ప్రసాదాలు ఆధ్యాత్మిక గ్రంథాలు ఉచితంగా పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీను సిద్ధాంతిని , ఆధ్యాత్మిక దాకమర్రి ప్రకాశ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త శ్రీ సంకురు భుక్త ప్రకాష్ గారు, ఆధ్యాత్మిక గురువులు శ్రీ రామకృష్ణనంద స్వామి, యాలాల శ్రీనివాసరావు స్వామి, ప్రకాశానంద స్వామి, పలువురు ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనీ ప్రసాదాలు స్వీకరించారు.

# వారసత్వ సంపద భావితరాలకు అందించాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):అజాది కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఉదయం 6.00 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి హవామహల్ వరకు హెరిటేజ్ ర్యాలీను డివిజనల్ రెవెన్యూ అధికారి హుసేన్ సాహెబ్ జాతీయ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హుసేన్ సాహెబ్ మాట్లాడుతూ ఈ నెల 1వ తేది నుండి ఆగష్టు 15 తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు హెరిటేజ్ వాక్ లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. మన వారసత్వ సంపద భావితరాలకు అందించాలని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమర యోధులను స్మరించుకోవలసిన ఆవశ్యకతతో పాటు భావితరాలకు తెలియ జేయవలసిన భాధ్యత మనపై ఉందన్నారు.

పురావస్తు శాఖ సహాయ సంచాలకులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా పరిధిలో ప్రధానంగా 9 చారిత్రక కట్టడాలు ఉన్నాయని వాటిని కాపాడుకోవలసిన భాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. వీటిలో ప్రధానంగా బౌద్దరామాలు తొట్లకొండ, బావికొండ మరియు పావురాల కొండ ఉన్నాయని అన్నారు.

ఈ హెరిటేజ్ వాక్ లో సమాచార శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్. సూర్యరావు, ఇంటాక్ సంస్థ సభ్యులు, అధికారులు, ఎన్జీవో సంఘ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మాజీ సైనికుల ర్యాలీ




ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సైనిక్ బోర్డు ఆధ్వర్యంలో మాజీ సైనికులు నగర పౌరులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక్ బోర్డు కార్యాలయం నుంచి కేడీపీఎం హైస్కూల్, ఈస్ట్ పాయింట్ కాలనీ వరకు ర్యాలీ సాగింది. ఈ నేపథ్యంలో 1971 ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న పలువురు మాజీ సైనికులను జిల్లా సైనిక్ బోర్డు అధికారి సత్కరించారు. ఈ సత్కారాన్ని అందుకున్న వారిలో విశాఖనగరం జ్ఞానాపురానికి చెందిన వెటరన్, అడ్వకేట్ కొయ్యాన రాంబాబు ఉన్నారు.



## నా అతిథి లఘు చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వ్యాలీవుడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బేనర్ పై ఇటీవల నిర్మించిన లఘు చిత్రం లినా అతిథిలి గోడపత్రిక ఆవిష్కరణ ఉదయం 10 గంటలకు రిటైర్డ్ ఎ.డి.సి.పి. మరియు గాయకులు మహ్మద్ ఖాన్ చేతులు మీదుగా జరిగింది. వచ్చేవారం థిల్లానా యూట్యూబ్ చానల్ లో విడుదల కానున్న ఈ లఘు చిత్రానికి నిర్మాత : బాదంగీర్ సాయి, దర్శకుడు : యం. పవన్ కళ్యాణ్, సమర్పణ : రేఖాబోజ్, హీరో : కుమార్ రాజ్, హీరోయిన్ : కుమారి స్రవంతి ఇతరులు యల్. మోహన్, యం. పవన్ కళ్యాణ్, పోస్ట్ ప్రొడక్షన్ : వైజాగ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ అండ్ స్టూడియో, డి.ఓ.పి. : చిన్ని కృష్ణ, జయరాం, ఎడిటర్ : రోషన్ రెడ్డి, సౌండ్ ఇంజినీర్ అండ్ వి.ఎఫ్.ఎక్స్ : ఆదిబాబు దొడ్డి అని బాదంగీర్ సాయి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎల్లాజీ, గిరీష్, జమ్మా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీజేవైఎమ్ బైక్ ర్యాలీ ప్రారంభించిన రాజ్యసభ ఎంపి జీవిఎల్



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** అమృత మహోత్సవాలు సందర్భంగ గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ఆద్వర్యంలో శ్రీనగర్ బస్ స్టాప్ నుండి పాతగాజువాక శీలానగర్ మీదుగా సిటీ పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా నినాదాలు చేస్తూ ర్యాలీ ముందు సాగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా ధక్షిణాది రాష్ట్రాల విప్ మరియు రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు పాల్గొని జెండా ఊపి యాత్రను ప్రారంబించారు. బీజేపి జాతీయ యువ మోర్చా ఉపాధ్యక్షులు అభినయ్ ప్రకాష్ సింగ్ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర మోహన్ బీజేపి జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర జాతీయ కార్యదర్శి వంశీయాదవ్ జిల్లా అధ్యక్షులు అశోక్ నాయకులు సిరసపల్లి నూకరాజు బొండా యల్లాజీ రావు గూటూరు శంకరరావు రోహిణి పద్మ పుష్పలత శ్రీదేవి భువనేశ్వరి నాగేశ్వర రావు పిల్లి తదితరులు పాల్గొన్నారు.

# చదువే గొప్ప ఆస్తి



**విజయనగరం:** చదువే పిల్లలకు మనమిచ్చే గొప్ప ఆస్తి అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విద్యాదీవెన సొమ్మును, విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారితో కలిసి కలెక్టరేట్ ఆడిటోరియంలో లైవ్ టెలికాస్ట్ ద్వారా తిలకించిన అనంతరం, జెడ్‌పి ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు. చదువు ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నది ముఖ్యమంత్రి నమ్మకమని అన్నారు. అందుకే రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలకు సిఎం పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టి, విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని చెప్పారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక లాంటి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నేరుగా తల్లుల ఖాతాల్లో ఫీజులను జమచేస్తూ, విద్యార్థులకు సిఎం అండగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల భవిష్యతును తీర్చిదిద్దేందుకు ఎంతగానో కృషి చేస్తున్నందుకు, ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో ఎంఎల్‌సి డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యుటీ మేయర్లు ఇసరపు రేవతీదేవి, కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

**50,276 మంది తల్లుల ఖాతాల్లో రూ.26,85,72,408 జమ :** జగనన్న విద్యాదీవెన పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11 లక్షల, 2వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.694కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి, గురువారం బాపట్లలో బటన్ నొక్కి విడుదల చేశారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలను, విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఈ మూడేళ్లలో కేవలం విద్యారంగానికే సుమారు రూ.53,338 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని సిఎం అన్నారు. విద్యాదీవెన క్రింద జిల్లాకు చెందిన 50,276 మంది తల్లులకు, ఏప్రెల్, మే, జూన్ నెలల ఫీజులకు సంబంధించి, రూ.26కోట్ల, 85లక్షల, 72వేల, 408 ను జమ చేశారు. వీరిలో బిసి విద్యార్థులు 40,569 మంది, ఎస్‌సిలు 4,821, ఈబిసిలు 2,835, కాపు విద్యార్థులు 1,006, ఎస్‌టిలు 760, ముస్లింలు 245, క్రిష్టియన్లు 40 మంది ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. అనంతరం విద్యాదీవెనకు సంబంధించిన చెక్కును కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారతాధికారి పి.రత్నం, ఇతర అధికారులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయంగా కొండకర్ల ఆవ సంరక్షణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఆగకొండకర్ల ఆవ సంరక్షణ శాస్త్రీయంగా జరగాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఆవ పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండకర్ల ఆవ అరుదుగా ఉండే చిత్తడి నేల మంచి నీటి సరస్సు గా గుర్తించడం జరిగిందని, అంతేకాకుండా అనేక పక్షులు జీవ జాలాలకు ఆలవాలమై ఉన్నందున ప్రకృతి సిద్ధంగా మనకు లభించిన మంచినీటి సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పర్యాటక రంగం కూడా విస్తృతంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక సరస్సుకు ఇటువంటి కమిటీని నియమించడం రాష్ట్రంలో ఇదే ప్రథమమని చెప్పారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి నెలకి ఒకసారి సమావేశం నిర్వహించాలి అన్నారు. కొండకర్ల సరస్సు వివరాలను తెలియజేసే యాప్ ను రూపొందించాలని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి అనంత శంకర్ ప్రణాళిక అధికారి రామారావు పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ దుర్గ గంగాభవాని

రియల్ ఎస్టేట్ & కన్సల్టెన్సీ (విజిట్ చేసి ఉన్న సైట్
47 సెంట్లు సెంటు లక్ష రూపాయలు చెబుతున్నారు
(2.274 గజాలు) గజం 2100 మాత్రమే
సుమారు 25 ఎకరాల లేఔట్ పక్కన
దక్షిణ ఫేసింగ్ 20 అడుగుల రోడ్డు అనుకొని
రోడ్డు ఫేసింగ్ 120 అడుగులు ఉంటుంది
చోడవరం కాంప్లెక్స్ కి కేవలం 1.5కి.మి మాత్రమే
రిసార్ట్స్ స్విమ్మింగ్ కి లాంటి వాటికి చాలా
అనుకూలత కలిగిన సైట్
భూమి అమ్మ దలచిన, కొన దలచిన
**బి.వి.ఆర్. మూర్తి**
8143122188, విశాఖ డిస్ట్రిక్ట్ & అనకాపల్లి డిస్ట్రిక్ట్


## అప్పన్నకు కరాళ చందన సమర్పణ

### శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఏర్పాట్లు
### నిత్య రూపం ఇక పరిపూర్ణము

**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కి శ్రావణ పౌర్ణమి సందర్భంగా కరాల చందనం సమర్పించనున్నారు. ఏడాది పొడవునా సుగంధ భరిత చందనము లో ఉండే స్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే భక్తులకు తన నిజరూప దర్శనం గావిస్తారు. అదే రోజు నిజరూప దర్శనం అనంతరం రాత్రికి సహస్ర ఘట్టాభిషేకం జరిపి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పించి, ఆ తర్వాత వచ్చే వైశాఖ, జేష్ఠ, ఆషాడ పౌర్ణమిలలో మూడేసి మణుగుల చొప్పున ఏడాదిలో నాలుగు రోజుల విడతలు కింద పన్నెండు మణుగుల చందనాన్ని సమర్పించడం సాంప్రదాయబద్ధంగా వస్తుంది.. ఈ నేపద్యంలోనే శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సింహాద్రినాధుడు కి కరాళ చందనం సమర్పించనున్నారు. ఇందుకు అనవసరమైన పచ్చి చందనాన్ని బుధవారం ఆలయ సిబ్బంది అరగదీసి అందులో సుగంధద్రవ్యాలను మిళితం చేసి అలయ భాండాగారములో భద్ర పరిచారు.

శుక్రవారం తెల్లవారుజామున సింహాద్రినాధుడును సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన గావించి అనంతరం కరాళ చందన సమర్పిస్తారు. ఆరోజు నుంచి సింహాద్రి నాధుడు నిత్య రూపం ఇక పరి పూర్ణము కానుంది. ఇందు కోసం ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**అప్పన్నను దర్శించుకున్న గంట్ల:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని బుదవారం అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు ,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టు ల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల సన్నిధిలో శ్రీను బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## స్మృత్యంజలి



శ్రీ తణుకు వెంకట రామ సుబ్బారావు గారు

DOB 14-11-1955 DOD 02-08-2022

శ్రీ తణుకు వెంకట రామ సుబ్బారావు గారి
ఆకస్మిక మృతికి సంతాప సభ

DATE & TIME : **ఆదివారం** 14TH AUGUST
**సాయంత్రం ఐదు గంటలకు**

మన సభ్యులు, బంధువులు, స్నేహితులు
విచ్చేసి నివాళులు అర్పించగలరు.

VENUE: SEMINAR HALL
COLLEGE OF PHARMACY
ANDHRA UNIVERSITY
NEAR SBI, ANDHRA UNIVERSITY.

విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం


## జనహిత మ్యాట్రిమోనీ

**తెలుగు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక**
**విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం**
**9-3-16, పిఠాపురం కోలనీ,**
**(కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు)**
**విశాఖపట్నం-530003**



**తేది : 21-8-2022, (ఆదివారం)**
సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.

శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
400 మంది వధూవరుల వివరములతో...

**రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు :**
**9393949345, 8074541283**
**9030841841 (సాయి గణేష్ : హైదరాబాద్)**


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.